# సామాజికవేత్త రవీందర్‌కు.. సేవా ప్రపూర్ణ అవార్డు..

## ప్రజాసేవే పరమావధిగా..! పర్యావరణ ప్రేమికుడికి దక్కిన అరుదైన గౌరవం..

- కూకట్‌పల్లిలో ఘనంగా సన్మానించి సూర్యచంద్ర అవార్డు-2026 ప్రదానం..
- కరోనా సమయంలో రవీందర్ ముదిరాజ్ సేవలకు ప్రత్యేక గుర్తింపు..
- ఇంకుడు గుంతలు, మొక్కల పెంపకంపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు..
- ప్లాస్టిక్ నియంత్రణకు ఉద్యమం.. పర్యావరణ పరిరక్షణే ధ్యేయం..
- ఈ అవార్డుతో బాధ్యత పెరిగింది.. సేవలు రెట్టింపు చేస్తా:కోలా రవీందర్ ముదిరాజ్..
- సామాజిక సేవా రంగంలో విశిష్ట సేవలు అందించిన రవీందర్ ముదిరాజ్..
- "సూర్యచంద్ర అవార్డు--2026" గ్రహీత రవీందర్‌కు పలువురి ప్రశంసలు..

-4 లో




పెన్ పవర్
తెలంగాణ రౌండప్

# కొలువుల జాతర షురూ



- నేడు 280 పోస్టులతో మూడు ప్రకటనలు
- వారం వ్యవధిలో మరో మూడు...
- ఇక నెలనెలా రెండు లేదా మూడు ఉద్యోగ నోటిఫికేషన్లు
- టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం వెల్లడి

-5 లో



# ఘనంగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు..

- మేడ్చల్ జిల్లాలో పండుగ వాతావరణం.. పూలు, తోరణాలతో అలంకరణ..
- ఇళ్ళ ప్రారంభోత్సవానికి హాజరైన అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి..
- జిల్లావ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు..
- కేశవరం గ్రామం ప్రారంభోత్సవంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు..
- పూలు, తోరణాలతో ఇళ్లను అలంకరించిన లబ్ధిదారులు..
- సొంతింటి కల నెరవేరిందంటూ ప్రభుత్వానికి కుటుంబాలు కృతజ్ఞతలు..

-6 లో

# భూములిచ్చిన రైతులకు.. రూ.157 కోట్లు చెక్కులు పంపిణీ..

-మేడ్చల్ జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి పరిహారం చెక్కుల పంపిణీ..



- ఎలివేటెడ్ కారిడార్‌కు భూములిచ్చిన రైతుల ఖాతాల్లో రూ.157 కోట్లు జమ..!
- తూంకుంట రైతులకు రెండో విడతగా పరిహార చెక్కుల పంపిణీ..
- 19,726.5 చదరపు గజాల భూమికి రూ.157 కోట్ల చెల్లింపులు..
- చదరపు గజానికి రూ.1 లక్ష ధర నిర్ణయించిన జిల్లా యంత్రాంగం..
- మిగిలిన రైతులకు త్వరలోనే తదుపరి విడతలో చెల్లింపులు
- కలెక్టర్ మను చౌదరిని, ఎస్‌డీసీఎల్ అధికారి మాలతిని సన్మానించిన రైతులు..

-7 లో






కోలా రవిందర్ ముదిరాజ్.. సామాజిక వేత్త, పర్యావరణ ప్రేమికుడు, ప్లాస్టిక్ నియంత్రణకై నిత్యం పోరాటం..



అవార్డు అందుకుంటున్న సామాజిక వేత్త కోలా రవిందర్ ముదిరాజ్..

# సామాజికవేత్త రవీందర్‌కు... సేవా ప్రపూర్ణ అవార్డు

## ప్రజాసేవే పరమావధిగా..! పర్యావరణ ప్రేమికుడికి దక్కిన అరుదైన గౌరవం..

సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ, ప్రజా చైతన్య కార్యక్రమాల్లో విశేష కృషి చేసిన సూరారం కాలనీకి చెందిన సామాజిక వేత్త, పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్‌కు "సూర్యచంద్ర అవార్డు--2026"ను ప్రదానం చేసి, ఘనంగా సన్మానించారు.. కూకట్‌పల్లిలోని భారత్ వికాస్ పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డును అందజేశారు.. ఈ కార్యక్రమానికి అధ్యక్షులు మోహన్ చంద్ర, కార్యదర్శి అనిల్ కుమార్, చల్లా రాజశేఖర్ రెడ్డి, కృష్ణమాచార్యులు, జయంత్ రెడ్డి తదితరులు హాజరై అవార్డు గ్రహీతలను అభినందించారు. సూరారం కాలనీకి చెందిన ఆర్.ఆర్. రాజేందర్ పిల్లయ్ తోపాటు, కోల రవీందర్ ముదిరాజ్ సామాజిక సేవా కార్యక్రమాల్లో చేసిన సేవలను నిర్వహకులు కొనియాడారు.. కరోనా మహమ్మారి విజృంభణ సమయంలో ప్రజలను అప్రమత్తం చేయడంలో, అవసరమైన నిత్యావసర సరుకులను అందించడంలోనూ, రవీందర్ ముదిరాజ్ కీలక పాత్ర పోషించినట్లు నిర్వాహకులు తెలిపారు..




రవీందర్ ముదిరాజ్‌కు అందజేసిన అవార్డు..

- కూకట్‌పల్లిలో ఘనంగా సన్మానించి సూర్యచంద్ర అవార్డు-2026 ప్రదానం..
- కరోనా సమయంలో రవీందర్ ముదిరాజ్ సేవలకు ప్రత్యేక గుర్తింపు..
- ఇంకుడు గుంతలు, మొక్కల పెంపకంపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు..
- ప్లాస్టిక్ నియంత్రణకు ఉద్యమం.. పర్యావరణ పరిరక్షణే ధ్యేయం..
- ఈ అవార్డుతో బాధ్యత పెరిగింది.. సేవలు రెట్టింపు చేస్తా:కోలా రవీందర్ ముదిరాజ్..
- సామాజిక సేవా రంగంలో విశిష్ట సేవలు అందించిన రవీందర్ ముదిరాజ్..
- "సూర్యచంద్ర అవార్డు--2026" గ్రహీత రవీందర్‌కు పలువురి ప్రశంసలు..

నిత్యం సామాజిక సేవకే పరిమితమైన.. పర్యావరణ ప్రేమికుడు, ప్లాస్టిక్ నియంత్రణకై ప్రజలను చైతన్య పరిచి, అలుపెరుగని పోరాట చేస్తున్న, యోధుడు, కోలా రవీందర్ ముదిరాజ్ విశేష కృషికి అరుదైన గౌరవం లభించింది.. ఆయన సేవలను గుర్తించి "సూర్తచంద్ర అవార్డు-2026"కు ఎంపిక చేసి, సోమవారం కూకట్‌పల్లిలోని భారత్ వికాస్ పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించి పురస్కారాన్ని అందజేశారు.. ఈత(స్విమ్మింగ్) ఒక సాధన, పాఠ్యాంశంగా చేర్చాలని, ముఖ్యంగా 6-10 తరగతుల విద్యార్థులకు అవగాహన కల్పించి, ఒక పాఠంగా వివరించి, ఈత ప్రాముఖ్యతను, తెలియజేయాలని, ప్రజాప్రతినిధులకు, మంత్రులకు నిత్యం వినతిపత్రాలు అందజేస్తూ గత 15-20 ఏళ్ళుగా కృషికి ఫలితంగా ఈ అవార్డును అసయన వరంగా భావించారు.. ఈ అవార్డుతో తనకు మరింత సేవలు అందించే బాధ్యతలు అప్పగించారంటూ, అవార్డు గ్రహీత కోలా రవీందర్ ముదిరాజ్ హర్షం వ్యక్తం చేశారు..

కూకట్‌పల్లి, పెన్ పవర్, జూన్ 1:

## సామాజిక వేత్త రవీందర్ సేవలు..

సూరారం కాలనీకీ చెందిన కోలా రవిందర్ ముదిరాజ్, సామాజిక సేవల గురించి కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బహుశా తెలియని వారు లేకపోవచ్చు.. అంతే కాకుండా విద్యార్థుల్లో ఈతపై అవగాహన కల్పించడం, ఇంటింటా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని ప్రోత్సహించడం, ప్రతి ఇంటి ముందు కనీసం రెండు మొక్కలు నాటాలని సూచించడం వంటి పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను నిరంతరం చేపడుతున్నారని పేర్కొన్నారు.. ప్రజల మధ్యే ఉంటూ ట్రాఫిక్ సమస్యలు ఉన్నప్పుడు వాహనదారులకు సహాయం చేయడం, రహదారులపై ప్రమాదాలకు కారణమయ్యే వస్తువులను తొలగించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని నిరుత్సాహపరుస్తూ చేతి సంచుల వినియోగం ప్రాముఖ్యతను, తెలియ పరిచి ప్రోత్సహించడం, శుభకార్యాలకు సైతం స్టీల్ ప్లేట్లను తీసుకెళ్లి పర్యావరణ హిత సందేశాన్ని అందించడం వంటి కార్యక్రమాలతో కోలా రవీందర్ ముదిరాజ్ ప్రత్యేక గుర్తింపు పొందారని నిర్వహకులు వివరించారు..



అవార్డు అందుకుంటున్న ఆర్.ఆర్. రాజేందర్ పిల్లయ్..

ఈ సందర్భంగా అవార్డు స్వీకరించిన రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ, ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. ప్రజాసేవలో మరింత రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తూ సమాజానికి సేవ చేయడానికి కట్టుబడి ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమానికి తన తండ్రి, 86 ఏళ్ల వయస్సు గల రిటైర్డ్ హెడ్‌మాస్టర్ ఈశ్వరయ్య హాజరు కావడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని రవిందర్ ముదిరాజ్ పేర్కొన్నారు..సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ, ప్రజా చైతన్య కార్యక్రమాల్లో నిరంతర కృషి చేస్తున్న రవీందర్ ముదిరాజ్‌ను సన్మానించడం పట్ల, తన సమీప బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు పలువురు అభినందించారు, తనకు అవార్డు దక్కడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు..

# కొలువుల జాతర షురూ

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉద్యోగార్థులకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టీజీపీఎస్సీ తీపి కబురు అందించింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి ఇకపై ప్రతినెలా రెండు, మూడు ఉద్యోగ ప్రకటనలు జారీ చేయనున్నట్లు వెల్లడించింది. మంగళవారం తొలుత 280 పోస్టులతో మూడు నోటిఫికేషన్లు ఇవ్వనున్నట్లు టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. ఇందులో కాలుష్య నియంత్రణ మండలిలో సహాయ పర్యావరణ ఇంజినీర్లు(9), రోడ్డు భవనాల శాఖలో ఏఈఈ సివిల్(222), ఏఈఈ ఎలక్ట్రికల్(49) పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్థికశాఖ అనుమతించిన ఉద్యోగాలు 3,800 అని, ఇందులో అటవీ బీట్ అధికారి పోస్టులు 1,393 ఉన్నాయన్నారు. ఆయా పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టామన్నారు. ఈ మేరకు సోమవారం టీజీపీఎస్సీ కార్యాలయంలో సభ్యులు అమీరుల్లాఖాన్, విశ్వప్రసాద్, చంద్రకాంత్‌రెడ్డి, లక్ష్మీకాంత్ రాథోడ్, కమిషన్ కార్యదర్శి హరితతో కలిసి బుర్రా వెంకటేశం విలేకరులతో మాట్లాడారు. మరో వారం రోజుల వ్యవధిలో మూడు ఉద్యోగ ప్రకటనలు వస్తాయని ఈ నెలలో మొత్తం ఆరు నోటిఫికేషన్లు ఉంటాయని వెల్లడించారు. టీజీపీఎస్సీపై నిరాధార ఆరోపణలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, కమిషన్ విచక్షణాధికారాలు ఉపయోగిస్తామని స్పష్టం చేశారు. డిప్యూటీ ఈవో ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు లేవని, ఈ నెలలోనే నోటిఫికేషన్ వచ్చే అవకాశముందని వివరించారు. ఇంకా ఏమన్నారంటే...

**సీబీఆర్‌టీ పరీక్షలు**

"ఉద్యోగ నియామకాలకు సంబంధించి 90% నోటిఫికేషన్లకు కంప్యూటర్ ఆధారిత పరీక్షలు(సీబీఆర్‌టీ) నిర్వహించాలని కమిషన్ భావిస్తోంది. తద్వారా పరీక్షల నిర్వహణ సమయాన్ని తగ్గించవచ్చు. ముద్రణ, తరలింపు, పేపర్ లీకేజీ వంటి సమస్యలుండవు. సీబీఆర్‌టీ కావడంతో ఒకరోజు లేదా పరీక్షకు గంట ముందు ప్రశ్నపత్రం ఆటోమెటిక్‌గా సిద్ధమవుతుంది. సీబీఆర్‌టీ పరీక్ష ముగిసిన వెంటనే అభ్యర్థికి అప్పటికే సిద్ధమైన ప్రాథమిక కీ ప్రకారం ఆ పరీక్షలో సాధించిన స్కోరు స్క్రీన్‌పై ప్రత్యక్షమవుతుంది. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా సీబీఆర్‌టీ పరీక్షలపై నిర్ణయం తీసుకుంటాం.

వివరాలు వెల్లడిస్తున్న టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రావెంకటేశం. చిత్రంలో టీజీపీఎస్సీ కార్యదర్శి హరిత, కమిషన్ సభ్యులు అమీరుల్లాఖాన్, విశ్వప్రసాద్, సి.చంద్రకాంత్‌రెడ్డి, ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్

**ప్రతిభా వారధి ద్వారా...**

యూపీఎస్సీ 'ప్రతిభా సేతు' కార్యక్రమం మాదిరిగా టీజీపీఎస్సీ 'ప్రతిభా వారధి' తీసుకురావాలని భావిస్తోంది. లక్షల మంది అభ్యర్థులు టీజీపీఎస్సీ పరీక్షలు రాస్తారు. రాత పరీక్షల్లో మెరిట్ సాధించినా తుది జాబితాలో చోటు సంపాదించలేకపోయిన వారికి నిరాశే మిగులుతుంది. అలాంటి మెరిట్ అభ్యర్థులు ప్రభుత్వంలో ఒప్పంద, ఇతర పోస్టులకు ఎంపికయ్యేలా.. ప్రైవేటులోనూ ఉద్యోగాలు పొందే అవకాశం దీని ద్వారా లభిస్తుంది.

గరిష్ఠంగా తొమ్మిది నెలల్లో

ఒక అంచెలో నిర్వహించే పోటీపరీక్షల నియామకాలను మూడు నుంచి ఆరు నెలల్లో పూర్తిచేస్తాం. రెండు లేదా అంతకుమించితే ఆయా ఉద్యోగాలను ఆరు నెలల నుంచి గరిష్ఠంగా 9నెలల్లో భర్తీ చేస్తాం.

డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్ పోస్టుల భర్తీకి యూజీసీ నిబంధనల ప్రకారం ఇంటర్వ్యూలు నిర్వహించాల్సి ఉందని ఉన్నతవిద్యాశాఖ నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. వాటిని అమలు చేస్తాం.

కాలుష్య నియంత్రణ మండలిలో అసిస్టెంట్ సైంటిస్ట్(అనలిస్టు గ్రేడ్-2) పోస్టులకు దరఖాస్తు గడువు సోమవారంతో ముగిసింది. మొత్తం 20 పోస్టులకు 19 వేల దరఖాస్తులు వచ్చాయి.

కొన్ని విభాగాల్లో ఒకట్రెండు ఉద్యోగాలున్నాయి. వీటిని ఒకచోటకు చేర్చి నోటిఫికేషన్లు ఇవ్వాలా... లేదా? అనే అంశంపై సంబంధిత ప్రభుత్వ విభాగాలతో చర్చిస్తున్నాం.

11 రకాల విభాగాల్లో 50కిపైగా పోస్టులున్నాయి. వీటిని భర్తీ చేసేందుకు నిరంతర నోటిఫికేషన్లు జారీ చేస్తాం. మున్ముందు ప్రతినెలా రెండు, మూడు ఉద్యోగ ప్రకటనలు... అలాగే తుది ఫలితాలు వస్తుంటాయి.

ఉద్యోగార్థులు తమ పూర్తి వివరాలు సమగ్రంగా ఉండేందుకు ఓటీఆర్‌ను అప్‌డేట్ చేయాలి. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 32 లక్షల మంది ఓటీఆర్ చేసుకున్నారు.

## ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని



**హైదరాబాద్ పెన్ పవర్:** పురస్కరించుకుని.. రాష్ట్ర ప్రజలకు భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాధన పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను కేసీఆర్ ఒక ప్రకటనలో స్మరించుకున్నారు. "తెలంగాణ ప్రజలపై దశాబ్దాలపాటు సాగిన అణచివేతకు వ్యతిరేకంగా పోరాడి, అనేక అవాంతరాలను అధిగమించి ప్రజాస్వామ్యయుతంగా కొట్లాడి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నాం. విమర్శించిన నోళ్లు మూతపడేలా పదేళ్లలో ప్రగతి పాలనను అందించాం. తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుకున్నాం. ప్రగతికి చిరునామాగా మారిన తెలంగాణ అస్తిత్వం.. తిరిగి మరోసారి ప్రమాదంలో పడకుండా అప్రమత్తంగా ఉండాలి. తెలంగాణ రాష్ట్ర రక్షణలో భారాస ఎల్లప్పుడూ రక్షణ కవచంగా నిలుస్తుంది" అని కేసీఆర్ పేర్కొన్నారు.

**ఉద్యమ స్ఫూర్తి సజీవంగా ఉండాలి: మహేశ్‌కుమార్‌గౌడ్**

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన సుదీర్ఘ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరవీరులను స్మరించుకుంటూ వారికి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని సజీవంగా ఉంచుకుంటూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి పథంలో రాష్ట్రం మరింత ముందుకు సాగాలని సోమవారం ఆయనొక ప్రకటనలో ఆశాభావం వ్యక్తంచేశారు.

## తెలంగాణ ఆవిర్భావ వేడుకలు.. సికింద్రాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా (జూన్ 02) సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో ఘనంగా వేడుకలు నిర్వహించనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు వేడుకల్లో పాల్గొననున్నారు. ఈ క్రమంలో సికింద్రాబాద్ లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేడుకల్లో భాగంగా పరేడ్ గ్రౌండ్ చుట్టు పక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని మల్కాజ్ గిరి కమిషనరేట్ పోలీసులు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం12 గంటల వరకు పరేడ్ గ్రౌండ్స్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నారు. బేగంపేట, సంగీత్ జంక్షన్, తిరుమలగిరి, బోయిన్ పల్లి వైపు వెళ్లేవారు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోలని ఈ సందర్భంగా సూచించారు. రోడ్లపై పార్కింగ్ చేయరాదని చెప్పారు. వేడుకల్లో ప్రభుత్వ కార్యవర్గంతో పాటు తెలంగాణ నలుమూలల నుంచి ప్రజానీకం పాల్గొంటున్న సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ట్రాఫిక్ ఆంక్షలతో పాటు రద్దీ ఎక్కువగా ఉండటంతో.. ప్రయాణీకులు ఆ రూట్లలో మెట్రో ప్రయాణం ఎంచుకోవడం మేలని పోలీసులు సూచించారు. వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చే వారు ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వాటర్ బాటిల్ క్యారీ చేయాలని సలహా ఇచ్చారు.




- ఇళ్ళ ప్రారంభోత్సవానికి హాజరైన అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి..
- జిల్లావ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు..
- కేశవరం గ్రామం ప్రారంభోత్సవంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు..
- పూలు, తోరణాలతో ఇళ్లను అలంకరించిన లబ్ధిదారులు..
- సొంతింటి కల నెరవేరిందంటూ ప్రభుత్వానికి కుటుంబాలు కృతజ్ఞతలు..



ఇందిరమ్మ ఇళ్ళ వద్ద లబ్దిదారులతో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి..

# ఘనంగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు..

## మేడ్చల్ జిల్లాలో పండుగ వాతావరణం.. పూలు, తోరణాలతో అలంకరణ..



లబ్దిదారులతో గృహప్రవేశం చేయిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూన్ 1:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఇళ్లకు సోమవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా గృహప్రవేశాలు నిర్వహించారు.. ఈ కార్యక్రమాలు పండుగ వాతావరణంలో జరుపుకున్నారు.. లబ్ధిదారులు కుటుంబ సభ్యులతో కలిసి కొత్త ఇళ్లలోకి అడుగుపెట్టారు.. మూడ్చింతలపల్లి మండలంలోని కేశవరం గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, మార్కెటింగ్ చైర్మన్ నరసింహులు యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్టీఏ కమిషన్ సభ్యుడు జైపాల్ రెడ్డి పాల్గొని లబ్ధిదారులతో కలిసి ఇళ్లను ప్రారంభించారు.. ప్రభుత్వ సహకారంతో సొంతింటి కలను సాకారం చేసుకున్న లబ్ధిదారులను అధికారులు అభినందించారు. గృహప్రవేశాల సందర్భంగా లబ్ధిదారులు తమ ఇళ్లను రంగురంగుల పూలు, మామిడి తోరణాలు, రంగవల్లులతో అలంకరించి ఆనందాన్ని వ్యక్తం చేశారు. కేశవాపూర్ గ్రామానికి చెందిన చిట్టిమిల్ల రేణుక, మేర్పాటి పద్మ, బుడిగే మల్లేష్, మోరుగంటి వెంకటేష్, బుట్టెం కృష్ణారెడ్డి తదితర లబ్ధిదారులకు గృహప్రవేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తమ సొంతింటి కలను నెరవేర్చిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు



కేశవరం గ్రామంలో ఇళ్ళను ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి..







# రెండు రోజుల్లో హెల్త్‌కేర్ ట్రస్ట్

**ఉద్యోగుల సూచనలతో విధివిధానాలు రూపొందిస్తాం**

**10 రోజుల్లో ఈహెచ్ఎస్ అమలు**

**భార్యాభర్తలిద్దరూ ఉద్యోగులైతే ఒకరి నుంచే వాటా తీసుకుంటాం**

**ఉద్యోగుల జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో సీఎస్ రామకృష్ణారావు**



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు నగదు రహిత చికిత్సలు అందించే ఉద్యోగుల ఆరోగ్య పథకం(ఈహెచ్ఎస్) అమలుకు రెండు రోజుల్లో హెల్త్‌కేర్ ట్రస్ట్(ఈహెచ్‌సీటీ) ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు వెల్లడించారు. ట్రస్టు ఏర్పాటు, దాని పనితీరుకు సంబంధించిన మార్గదర్శకాలు రూపొందించే క్రమంలో ఉద్యోగుల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. ట్రస్టుకు స్వయం ప్రతిపత్తి ఉంటుందని, అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులే దాన్ని నడుపుతారని తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2వతేదీ నుంచి ఈహెచ్ఎస్‌ను అమలుచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించిన నేపథ్యంలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని 15 సంఘాల ప్రతినిధులతో సచివాలయంలో సోమవారం సీఎస్ సమావేశమై చర్చించారు. దాదాపు రెండు గంటలపాటు జరిగిన సమావేశంలో అన్ని సంఘాలు.. పథకం అమలు కోసం పలు సూచనలు, సలహాలు అందించాయి. లిఖితపూర్వకంగా వినతిపత్రాలు అందజేశాయి. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, రానున్న ఏడు రోజుల్లో రెఫరల్ ఆసుపత్రులు, చికిత్సల జాబితా తదితర వివరాలతో మార్గదర్శకాలు విడుదలచేసి, పది రోజుల్లో ఈహెచ్ఎస్‌ను నగదు రహిత చికిత్స విధానంలో అమలుచేస్తామని స్పష్టంచేశారు.

జూన్ 2వ తేదీ నుంచి పథకాన్ని అమలు చేయాలనే సంకల్పంతోనే వేతనాల్లో 1.5 శాతం వాటా తీసుకున్నట్లు చెప్పారు. సమావేశంలో ఉన్నతాధికారులు దానకిశోర్, సందీప్‌కుమార్ సుల్తానియా, మహేష్ దత్ ఎక్కా, క్రిస్టినా చోంగ్తూ, లోకేశ్‌కుమార్, యోగితా రాణా, నవీన్ నికోలస్, విజయేంద్ర బోయి, ఉద్యోగుల ఐకాస ఛైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, టీజీఈజాక్ ఛైర్మన్ లచ్చిరెడ్డి, వివిధ ఉద్యోగ సంఘాల నేతలు బి.శ్యామ్, పుల్లం దామోదర్‌రెడ్డి, చావ రవి, సదానందంగౌడ్, వంగా రవీందర్‌రెడ్డి, డాక్టర్ సురేష్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, కటకం రమేష్, సైదులు, మధుసూదన్‌రెడ్డి, ఖాదర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ రామకృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగ సంఘాల నేతలు శ్రీనివాసరావు, జగదీశ్వర్. చిత్రంలో సైదులు, వెంకట్, దామోదర్‌రెడ్డి, ముజీబ్, శ్యామ్ తదితరులు

సమావేశంలో ముఖ్యాంశాలివీ...

ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు జమయిన రోజే ప్రభుత్వ వాటాను ట్రస్ట్ ఖాతాలో జమచేస్తారు. ట్రస్ట్‌కోసం ప్రత్యేక బ్యాంకుఖాతా తెరుస్తారు.

భార్యాభర్తలిద్దరూ ఉద్యోగులైతే...ఒకరి నుంచే వాటా తీసుకుంటారు.

సీపీఎస్ ఉద్యోగులు.. తమకు ఇష్టమైతే పదవీ విరమణ అనంతరం కూడా పథకంలో కొనసాగవచ్చు. కొనసాగాలనుకుంటే మూడు, ఆరు నెలలకు ఒకసారి లేదా వార్షిక ప్రాతిపదికన ముందస్తుగా చలానా ద్వారా చందా చెల్లించాల్సి ఉంటుంది.

**ఉద్యోగ సంఘాలు చేసిన ముఖ్య సూచనలివీ..**

కుటుంబ సభ్యులను పరిగణనలోకి తీసుకునే సందర్భంలో సోదరి, సోదరులను కూడా అనుమతించాలి.

సంవత్సరానికి ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేసుకోవడానికి అనుమతించాలి.

అవివాహితులైన సంతానానికి 25 సంవత్సరాలు దాటినా పథకం వర్తింపజేయాలి.



భూములిచ్చిన రైతులకి చెక్కుల పంపిణీ చేస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్..

- ఎలివేటెడ్ కారిడార్‌కు భూమిలిచ్చిన రైతుల ఖాతాల్లో రూ.157 కోట్లు జమ..!
- తూంకుంట రైతులకు రెండో విడతగా పరిహార చెక్కుల పంపిణీ..
- 19,726.5 చదరపు గజాల భూమికి రూ.157 కోట్ల చెల్లింపులు..
- చదరపు గజానికి రూ.1 లక్ష ధర నిర్ణయించిన జిల్లా యంత్రాంగం..
- మిగిలిన రైతులకు త్వరలోనే తదుపరి విడతలో చెల్లింపులు
- కలెక్టర్ మను చౌదరిని, ఎస్‌డీసీఎల్ అధికారి మాలతిని సన్మానించిన రైతులు..

# భూములిచ్చిన రైతులకు... రూ.157 కోట్లు చెక్కులు పంపిణీ

## మేడ్చల్ జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి పరిహారం చెక్కుల పంపిణీ..



రైతులతో కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి..





మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూన్ 1: సికింద్రాబాద్ నుంచి శామీర్‌పేట్ వరకు ప్రతిపాదిత ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం భూములు ఇచ్చిన తూంకుంట గ్రామ రైతులకు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సోమవారం రూ.157 కోట్ల పరిహార చెక్కులను పంపిణీ చేశారు.. జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి కలెక్టర్ రైతులకు రెండో విడత పరిహార చెక్కులను అందజేశారు.. రాజీవ్ రహదారి విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం తూంకుంట గ్రామ పరిధిలో 24 ఎకరాల భూమిని సేకరిస్తుండగా, రెండో విడతలో 19,726.5 చదరపు గజాల స్థలాన్ని అప్పగించిన రైతులకు ఈ చెక్కులు అందజేశారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ, భూసేకరణ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని, అర్హులైన మిగిలిన రైతులకు కూడా తదుపరి విడతల్లో పరిహారం అందజేస్తామని తెలిపారు.. తమ భూములకు చదరపు గజానికి రూ.1 లక్ష చొప్పున పరిహారం నిర్ణయించడంలో కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని రైతులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే పరిహార చెక్కుల పంపిణీలో ప్రత్యేక శ్రద్ధ కనబరిచిన ఎస్‌డీసీఎల్ అధికారి మాలతితోపాటు కలెక్టర్ మను చౌదరిని రైతులు శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు..

# భర్తే భార్యను కడతేర్చాడు

హైదరాబాద్ పెన్ పవర్: సంగారెడ్డి జిల్లాలో మహిళ హత్య కేసులో ట్విస్ట్ ఏర్పడింది. భర్తే హత్య చేసి.. గుర్తు తెలియని వ్యక్తులు చంపారని నాటకం ఆడినట్లు పోలీసులు తేల్చివేసారు. తామిద్దరం మార్కెట్ కు వెళ్లి తిరిగి వస్తుండగా.. గుర్తు తెలియని వ్యక్తులు అడ్డగించి, కత్తులతో దాడి చేసి, అతని ముందే భార్య మీనా దేవి గొంతు కోసి హత్య చేశారని పోలీసులకు భర్త అనిల్ కుమార్ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. విచారణలో అతని మాటల్లో పొంతన లేకపోవడంతో.. పోలీసులు గట్టిగా ప్రశ్నించడంతో, తానే తన భార్య మీనాదేవిని గొంతు కోసి చంపానని ఒప్పుకున్నాడు. దంపతులు గత 20 ఏళ్లుగా వెంకటేశ్వర కాలనీలో ఉంటున్నారు. భార్య హత్యకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

# తెలంగాణ బీజేపీలో పోస్టర్ వార్

హైదరాబాద్ పెన్ పవర్: మల్కాజ్ గిరి ఎంపి ఈటెల రాజేందర్ మీద నిజామాబాద్ ఎంపీ అరవింద్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈటెల ఏడుపే బీజేపీకి శాపం. ఈటలకు రాష్ట్ర అధ్యక్ష పదవి రాలేదని ఏడుపు. సీఎం అభ్యర్థిగా ప్రకటించలేదని ఏడుపు. కేంద్ర మంత్రి పదవి రాలేదని ఏడుపు అని ఫ్లెక్సీలలో పేర్కొన్నారు.
రెండు చోట్ల ఎమ్మెల్యేగా ఈటల పోటీ చేసే అవకాశం ఇచ్చింది బీజేపీ. ఓడిపోయినా మల్కాజిగిరి ఎంపీ టికెట్ ఇచ్చింది బీజేపీ. మోదీ రి నాయకత్వంలో గెలిచాక కూడా "నా ఇమేజ్ తోనే గెలిచాను" అనడం ఏ రాజకీయ నైతికత. బీసీ నాయకులు ఎదుగుతుంటే అసహనం ఎందుకు ? ఇందూరు బిడ్డ ఎంపీ అరవింద్ కు వస్తున్న ఆదరణ చూసి కడుపుమంట ఎందుకు ? "నేనే బీసీ నాయకుడిని... నేనే ప్రత్యామ్నాయం" అనే భ్రమ నుంచి బయటకు రా ఈటెల! అంటే మేడ్చల్ లోని పలు చోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసారు.

# ఎన్టీఆర్ నామం.. రేవంత్ వ్యూహం

హైదరాబాద్ పెన్ పవర్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ ఎత్తుగడలు ఎప్పుడూ ఒక దెబ్బకు రెండు పిట్టలు అన్న చందంగా ఉంటాయి. తాజాగా అమీర్‌పేట మైత్రివనం వద్ద ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ ఉదంతం కేవలం ఒక విగ్రహావిష్కరణగా కాకుండా, రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల కోసం ఆయన వేసిన భారీ రాజకీయ స్కెచ్‌గా విశ్లేషకులు భావిస్తున్నారు. తెలంగాణ కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఉండి, గతంలో ఎన్టీఆర్ తో ఉన్న ఉన్న కాంగ్రెస్ వైరం చరిత్రను పక్కన పెట్టి రేవంత్ రెడ్డి ఎన్టీఆర్ జపం చేయడం వెనుక బలమైన రాజకీయ కారణం ఉంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆంధ్ర ప్రాంతం నుంచి వలస వచ్చిన వారు, స్థానికంగా ఉన్న తెలుగుదేశం సానుభూతిపరులు నిర్ణయాత్మక శక్తిగా ఉన్నారు. ప్రస్తుతం తెలంగాణలో టీడీపీ క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉండటంతో, ఆ పార్టీ కోర్ ఓట్ బ్యాంక్ అనాథగా మారింది. ఈ శూన్యాన్ని భర్తీ చేసి, ఆ ఓట్లను కాంగ్రెస్ ఖాతాలోకి మళ్లించడమే రేవంత్ అసలు లక్ష్యం.సాధారణంగా తెలుగుదేశం సానుభూతిపరులు మొదటి నుంచీ కాంగ్రెస్ వ్యతిరేక భావజాలంతో పెరిగిన వారు. ఎన్టీఆర్ పెట్టిన కాంగ్రెస్ వ్యతిరేక పునాదులే వారి రాజకీయ సిద్ధాంతం. మరి అలాంటి వారు కాంగ్రెస్‌కు ఓటు వేయాలంటే, ఆ పార్టీలో తమకు నచ్చిన వ్యక్తి ఉండాలి. రేవంత్ రెడ్డి సరిగ్గా ఆ పల్స్‌ను పట్టుకున్నారు. తాను కాంగ్రెస్ సీఎం అయినప్పటికీ, తన రాజకీయ మూలాలు ఎన్టీఆర్ సిద్ధాంతాల్లోనే ఉన్నాయని, ఇప్పటికీ చంద్రబాబు పట్ల తనకు గౌరవం ఉందని పరోక్షంగా సంకేతాలిస్తున్నారు. చంద్రబాబును ఆయన ఎప్పుడూ వ్యక్తిగతంగా విమర్శించకపోవడం వెనుక ఉన్న అసలు కారణం ఇదే.తెలంగాణలో టీడీపీ క్యాడర్ ఇప్పటికీ రేవంత్ రెడ్డిని మనవాడే అని భావిస్తుంది. ఇప్పుడు మైత్రివనం వంటి అత్యంత రద్దీ ప్రాంతంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా, అటు సెటిలర్లను, ఇటు టీడీపీ అభిమానులను రేవంత్ తన వైపు తిప్పుకున్నారు. మా పార్టీ నాయకుడు కాకపోయినా, మా దైవానికి గౌరవం ఇచ్చారు అనే భావనను టీడీపీ శ్రేణుల్లో కలిగించడంలో రేవంత్ నూటికి నూరు శాతం విజయం సాధించారు. ఎన్టీఆర్‌ను తెలుగు జాతి గర్వకారణం గా కీర్తిస్తూ, ఇటు తెలంగాణ వాదులను ఇబ్బంది పెట్టకుండానే అటు సెటిలర్ల మనసు గెలుచుకుంటున్నారు. దీనివల్ల గ్రేటర్ ఎన్నికల్లో బీఆర్ఎస్ వాడే సెంటిమెంట్ కార్డు ఇకపై పనిచేయదు. పైగా, ఎన్టీఆర్ లేకుంటే కేసీఆర్ ఎక్కడ అని రేవంత్ ప్రశ్నించడం ద్వారా బీఆర్ఎస్ అధినేతను డిఫెన్స్‌లో పడేశారు.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు రేవంత్ రెడ్డికి అగ్నిపరీక్ష లాంటివి. నగరంలో కాంగ్రెస్ బలపడాలంటే టీడీపీ సానుభూతిపరుల మద్దతు అనివార్యం. అందుకే, ఆయన వ్యూహాత్మకంగా తన ప్రసంగాల్లో ఇందిరా గాంధీతో పాటు ఎన్టీఆర్ పేరును కూడా సమానంగా వాడుతున్నారు.

# ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

హైదరాబాద్ పెన్ పవర్: మెహదీపట్నం బస్ స్టాప్ సమీపంలో సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రయాణీకుల కోసం ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనక నుంచి వచ్చిన ఒక కారు అతివేగంగా బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ఇంజిన్ భాగం పూర్తిగా బస్సు క్రిందకు దూసుకుపోవడంతో కారు నుజ్జునుజ్జయింది. ప్రయాణికులకు స్వల్ప గాయలయ్యాయి.

# క్రికెట్ మ్యాచ్ చూస్తూ బావిలోకి....

హైదరాబాద్ పెన్ పవర్: జగిత్యాల రూరల్ మండలం మోరపెల్లి వద్ద ఘోర ప్రమాదం జరిగింది. నివేష్, అశ్విన్, అరుణ్ అనే ముగ్గురు యువకులు థార్ వాహనంలో మొబైల్లో ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ చూస్తూ ప్రయాణించారు. ఈ క్రమంలో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న బావిలోకి దూసుకెళ్లింది. డ్రైవింగ్ చేస్తున్న జగిత్యాలకు చెందిన అరుణ్ బావిలో మునిగి మృతి చెందగా.. నివేష్, అశ్విన్ సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు, రెస్క్యూ సిబ్బంది రెండు గంటలు శ్రమించి అరుణ్ మృతదేహాన్ని, కారును బయటకు తీశారు.

# అమరావతిపై కన్నెత్తి చూడని టాలీవుడ్



**విజయవాడ, జూన్ 1 పెన్ పవర్:** అమరావతి రాజధాని నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. మొన్నటి వరకు ఏపీ రాజధాని ఏది అంటే చెప్పుకునే పరిస్థితిలో ప్రజలు ఉండేవారు కాదు. కానీ ఇప్పుడు మాత్రం సగర్వంగా చెప్పుకుంటున్నారు అమరావతి అని. అందుకు తగ్గట్టుగానే అమరావతి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అయితే అమరావతిలో 70 ప్రభుత్వ రంగ సంస్థలు నిర్మితం అవుతున్నాయి. అందులో బ్యాంకులు సైతం ఉన్నాయి. మరో నాలుగు వరకు ప్రైవేటు యూనివర్సిటీలు, ఆస్పత్రుల నిర్మాణం జరుగుతోంది. అయితే అమరావతి ఔన్నత్యాన్ని గుర్తించిన బాలీవుడ్ సంస్థలు అమరావతిలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి. భవిష్యత్తులో దక్షిణాది రాష్ట్రాల్లో అమరావతి అద్భుత నగరంగా మారుతుందని అంచనా వేస్తున్నారు బాలీవుడ్ ప్రముఖులు. అందుకే సంజయ్ దత్ లాంటివారు అమరావతికి వచ్చి.. ప్రభుత్వంతో చర్చలు జరిపి తన ఆసక్తిని బయటపెట్టారు. దీనిపై చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ సైతం సానుకూలత చూపారు. అయితే ఆయన ఒక్కరే కాదు బాలీవుడ్ ప్రముఖ సంస్థలు అమరావతిలో తమకు భూములు కేటాయించాలని కోరుతూ దరఖాస్తులు చేసుకుంటున్నాయి. అయితే వాటికి భూముల కేటాయింపుకు సంబంధించి సానుకూల నిర్ణయాలు దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.అమరావతి ఔన్నత్యాన్ని బాలీవుడ్ గుర్తించింది కానీ.. టాలీవుడ్ మాత్రం గుర్తించడం లేదు. అసలు ఏపీనే టాలీవుడ్ లెక్కచేయడం లేదు. ఏపీ పాలకుల విషయంలో కూడా అలానే ఉంది చిత్ర పరిశ్రమ పరిస్థితి. ఏపీ సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలవాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పలుమార్లు సూచించారు. కానీ ఇంతవరకు తెలుగు చిత్ర ప్రముఖులు వచ్చి సీఎం చంద్రబాబును కలిసిన పరిస్థితి లేదు. కనీసం అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు కూడా ముందుకు రావడం లేదు తెలుగు చిత్ర పరిశ్రమ ప్రముఖులు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మావిగన్ అంటూ పిచ్చి ప్రతిపాదన చేస్తోంది. దానిని పట్టించుకునే పరిస్థితి ఎవరికీ లేదు. పైగా ప్రజలు కూడా పెద్దగా ఆహ్వానించడం లేదు. అమరావతికి కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కూడా కల్పించింది. దీనిని గుర్తించిన ఎక్కడో ఉన్న బాలీవుడ్ పరిశ్రమ అమరావతికి వచ్చేందుకు సిద్ధపడింది. కానీ ఇక్కడ వ్యాపారం చేసుకుని లాభాలు ఆర్జిస్తున్న టాలీవుడ్ మాత్రం అమరావతి ముఖం చూడడం లేదు. ఇది ఎంత మాత్రం సహేతుకం కాదు. అమరావతి విషయంలో ఇప్పటికైనా తెలుగు చిత్ర పరిశ్రమ ఒక నిర్ణయానికి రావాలి. తెలుగు చిత్ర పరిశ్రమ అంటే హైదరాబాద్ అనే మాట దాటి ఏపీ వైపు విస్తరించాల్సిన అవసరం మాత్రం ఉంది.

# పరుగులు పెడుతున్న పోలవరం పనులు



**ఏలూరు, జూన్ 1, ( పెన్ పవర్:** పోలవరం ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్ చరిత్రలో అత్యంత ముఖ్యమైన, దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న బహుళార్థక ప్రాజెక్టుగా గుర్తించబడుతోంది. దాదాపు ఎనిమిది దశాబ్దాలుగా ఈ ప్రాజెక్ట్ వివిధ దశల్లో కొనసాగుతూ వస్తోంది. ప్రతిపాదన స్థాయి నుంచి పూర్తిస్థాయి నిర్మాణం వరకు ఇంత భారీ సమయం తీసుకున్న ప్రాజెక్ట్ దేశంలో చాలా అరుదు. అయినప్పటికీ ఇది రాష్ట్ర అభివృద్ధికి జీవనాడిగా భావించబడుతోంది.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం 2024 నుంచి ఈ ప్రాజెక్ట్ పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. 2027 జూలైలో జరిగే గోదావరి పుష్కరాల కంటే ముందే ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేయాలని లక్ష్యంగా పెట్టుకుని వేగంగా పనులు కొనసాగిస్తోంది. ఈ లక్ష్యంతో వివిధ విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.ప్రాజెక్ట్‌లో కీలకమైన భాగమైన ఎడమ కాలువ పనులు ప్రస్తుతం వేగంగా సాగుతున్నాయి. గోదావరి నది (జలాలను ఉత్తరాంధ్ర ప్రాంతానికి తరలించడం ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశాలలో ఒకటి. ముఖ్యంగా అనకాపల్లి , విశాఖపట్నం ( ప్రాంతాలకు నీటి సరఫరా అందించేందుకు ఈ కాలువ కీలక పాత్ర పోషించనుంది.ఎడమ కాలువలో నేషనల్ హైవేలు క్రాసింగ్ వద్ద బ్రిడ్జ్ నిర్మాణాలు, ఇతర ఇంజినీరింగ్ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఈ పనులు దాదాపు ముగింపు దశకు చేరుకుంటున్నాయి. పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి.ప్రణాళిక ప్రకారం మరో కొన్ని నెలల్లో ఎడమ కాలువ పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. ఆ తర్వాత గోదావరి జలాలను అనకాపల్లి వరకు తరలించే ప్రక్రియను ప్రారంభించేందుకు సిద్ధం అవుతున్నారు. ఆగస్టు నెలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కాలువను ప్రారంభించే అవకాశం ఉన్నట్లు సమాచారం.ఈ పనుల్లో ఆలస్యం జరగకుండా ఉండేందుకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులకు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. పనుల్లో నిర్లక్ష్యం లేకుండా వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని కూడా సూచించారు.ఇక మరో ముఖ్యమైన ప్రాజెక్ట్ వెలిగొండ ప్రాజెక్ట్ పనులు కూడా పురోగతిలో ఉన్నాయి. టన్నెల్–2లో 5.2 కిలోమీటర్ల లైనింగ్ పనులు పూర్తి చేయడం ఒక కీలక మైలురాయిగా భావించబడుతోంది. హెడ్ రెగ్యులేటర్లు, రిటైనింగ్ వాల్ వంటి నిర్మాణాలు కూడా పూర్తి అయినట్లు సమాచారం.అప్రోచ్ ఛానెల్‌లో ఉన్న మట్టిని తొలగించడం, టన్నెల్–1 పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. జూన్ చివరి నాటికి అవసరమైన ప్రధాన పనులు పూర్తయ్యేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ పనుల ద్వారా రాష్ట్రంలో నీటి వనరుల నిర్వహణ మరింత బలపడనుంది.

# స్థానిక ఎన్నికలు.. ఖర్చు భరించేదెలా...

**విజయవాడ జూన్ 1, పెన్ పవర్:** స్థానిక సంస్థల ఎన్నికలపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేసిన తాజా సూచనలు పార్టీ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. రానున్న ఎన్నికల్లో ఎక్కడా ఏకగ్రీవాలకు అవకాశం ఇవ్వకుండా ప్రతి చోటా అభ్యర్థులను నిలబెట్టాలని ఆయన స్పష్టంగా ఆదేశించినట్లు సమాచారం. రాష్ట్రంలోని ప్రతి గ్రామం, ప్రతి వార్డులో పోటీ ఉండేలా చూడాలని, అభ్యర్థుల కొరత అనే కారణం వినిపించకూడదని ఆయన సూచించారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అవసరమైతే బీసీ, ఎస్సీ వంటి వర్గాల నుంచి కొత్త కార్యకర్తలను ప్రోత్సహించి ఎన్నికల బరిలోకి దింపాలని కూడా ఆయన దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. దీని ద్వారా స్థానిక స్థాయిలో పార్టీ బలం ఏ మేరకు ఉందో పరీక్షించుకోవాలన్న ఉద్దేశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.ఇక రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన పాత్ర పోషిస్తున్న వైఎస్ఆర్ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నప్పటికీ క్షేత్రస్థాయి పరిస్థితులు మాత్రం భిన్నంగా ఉన్నాయని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా బలమైన పోరాటం కొనసాగిస్తున్నప్పటికీ, స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలా వద్దా అన్న సందిగ్ధంలో చాలా మంది కార్యకర్తలు ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, సర్పంచ్ వంటి పదవులకు పోటీ చేయాలంటే భారీగా ఖర్చు చేయాల్సి వస్తోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఒక సర్పంచ్ స్థానం కోసం కనీసం 20 లక్షల నుంచి 30 లక్షల రూపాయల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని, గెలిచినా ప్రతిపక్షంలో ఉండటంతో అభివృద్ధి పనులపై ప్రభావం ఉండదన్న భావన కూడా ఉందని చెబుతున్నారు.ఇదే సమయంలో ఆర్థిక పరిస్థితులు కూడా కేడర్‌ను వెనక్కి లాగుతున్నాయని సమాచారం. చాలా మంది చిన్నస్థాయి నాయకులు, కార్యకర్తలు ఇంత భారీ ఖర్చును భరించలేమని భావిస్తున్నారని పార్టీ అంతర్గత చర్చల్లో వెలుగులోకి వస్తోంది. అయితే పార్టీ అధినాయకత్వం మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రతి స్థానంలో పోటీ చేయాల్సిందే అని గట్టిగా సూచిస్తుండటంతో ఇంచార్జిలు సర్దుబాటు మార్గాలను వెతుకుతున్నారని అంటున్నారు. నియోజకవర్గ స్థాయిలో ఉన్న నాయకులు కొంత ఆర్థిక సహాయం అందిస్తారా అనే ఆశతో కొందరు ఎదురుచూస్తున్నట్లు తెలుస్తోంది.రానున్న రెండు మూడు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సన్నాహాలు వేగవంతం చేస్తోంది. అధికార కూటమి ప్రభుత్వం

కూడా ఈ ఎన్నికలను తమ పరిపాలనపై ప్రజల్లో విశ్వాసాన్ని చూపించే అవకాశంగా చూస్తోంది. అదే సమయంలో టీడీపీ నేతృత్వంలోని కూటమి, ఎన్నికల్లో ఆధిక్యం సాధించేందుకు వ్యూహాలు రూపొందిస్తోంది. ఈ పరిస్థితుల్లో వైసీపీ కూడా పోటీకి పూర్తిగా సిద్ధమవుతూ ప్రతి గ్రామంలో పోరాటం కొనసాగించాలని భావిస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో ఆర్థిక ఒత్తిళ్లు, అభ్యర్థుల ఎంపిక సమస్యలు పార్టీ వ్యూహానికి సవాల్‌గా మారే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# సత్యసాయి జిల్లా హైవే టెండర్లలో రిగ్గింగ్ కలకలం

**అనంతపురం జూన్ 1, పెన్ పవర్:** శ్రీ సత్యసాయి జిల్లాలో జాతీయ రహదారుల నిర్వహణ టెండర్ల చుట్టూ అలుముకున్న అవినీతి నీడలు ఇప్పుడు దేశ రాజధాని ఢిల్లీకి చేరాయి. చీఎ–42, చీఎ–340 రహదారులతో పాటు పలు ఆర్ఓబీ ల నిర్వహణ కోసం కేటాయించిన రూ. 10.69 కోట్ల షార్ట్ టర్మ్ మెయింటెనెన్స్ టెండర్లలో భారీ స్థాయిలో రిగ్గింగ్ జరిగిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల అండదండలతో కొన్ని నిర్మాణ సంస్థలు కుమ్మక్కై, అర్హత గల కాంట్రాక్టర్లను ఉద్దేశపూర్వకంగా తప్పించడమే కాకుండా, ప్రభుత్వ ఖజానాను లూటీ చేసేందుకు పక్కా స్కెచ్ వేశాయన్నది ఈ వివాదంలోని ప్రధానాంశం. శ్రీ సత్యసాయి జిల్లాలో జాతీయ రహదారుల నిర్వహణ ప్రక్రియ పారదర్శకతకు పాతర వేస్తూ సాగుతోందన్న విమర్శలు వస్తున్నాయి. కేంద్ర రోడ్డు రవాణా శాఖ ఈ పనుల కోసం టెండర్లు ఆహ్వానించిన తరుణంలో, క్షేత్రస్థాయిలో ఉన్న కొందరు ఉన్నతాధికారులు ఒక ప్రత్యేక 'రింగ్'గా ఏర్పడ్డారు. తాము అనుకున్న సంస్థలకే ఈ టెండర్లు దక్కేలా, నిబంధనలను తమకు అనుకూలంగా మార్చుకున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా ఈ ప్రక్రియలో పాల్గొన్న ఇతర సంస్థలను 'టెక్నికల్ గ్రౌండ్స్' పేరుతో అనర్హులుగా ప్రకటించి, పోటీ లేకుండా ఏకపక్షంగా టెండర్లను ముగించేందుకు యత్నించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ మొత్తం వ్యవహారంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ పాత్రపై తీవ్రమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంట్రాక్ట్ సంస్థలతో లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకుని, టెండర్ అంచనాలను కృత్రిమంగా పెంచి చూపడం ద్వారా ప్రభుత్వానికి కోట్లాది రూపాయల నష్టం వాటిల్లేలా చేశారని ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి రోడ్డు నిర్వహణకు అయ్యే ఖర్చు కంటే అంచనాలను రెట్టింపు చేసి చూపించడం వెనుక పెద్ద ఎత్తున కమీషన్ల పంపిణీ జరిగిందనే సమాచారం వెలుగులోకి వచ్చింది. కొంతమంది నిజాయితీ గల కాంట్రాక్టర్లు బిడ్డింగ్‌లో పాల్గొనకుండా అడ్డుకోవడం ఈ రిగ్గింగ్‌లో కీలక ఘట్టమని తెలుస్తోంది. కేవలం కాగితాల మీద మాత్రమే పనులు చూపించి, క్షేత్రస్థాయిలో అరకొర పనులతో బిల్లులు డ్రా చేసేలా ఈ టెండర్ల రూపకల్పన జరిగిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో రోడ్ల నిర్వహణ పేరుతో అత్యవసరంగా నిధులు మంజూరు చేయించుకుని, ఆ తర్వాత నాణ్యత లేని పనులతో సరిపెట్టేందుకు ఈ నెట్‌వర్క్ సిద్ధమైంది. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ల నుంచి టెక్నికల్ టీమ్ వరకు అందరూ ఏకమై ఈ అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆందోళన నిరుద్యోగ కాంట్రాక్టర్లలో వ్యక్తమవుతోంది. ఇది ప్రజాధనాన్ని నిలువునా దోచుకోవడమేనని స్థానిక నేతలు మండిపడుతున్నారు. ఈ అక్రమాలపై ఇప్పటికే కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ కి , ఆ శాఖ కార్యదర్శికి బీజేపీ సీనియర్ నేత విష్ణువర్ధ్ రెడ్డి ఫిర్యాదు చేశారు. అత్యంత విలువైన ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టకుండా ఉండాలంటే, కేంద్ర విజిలెన్స్ కమిషన్ రంగంలోకి దిగి లోతైన విచారణ జరపాలని డిమాండ్లు గట్టిగా వినిపిస్తున్నాయి. టెండర్ల బిడ్డింగ్ ఓపెన్ చేయడానికి ముందే ఈ ప్రక్రియను నిలిపివేసి, ప్రతి అంచనాను మళ్లీ వెరిఫై చేయించాలని బాధితులు కోరుతున్నారు. అవినీతి అధికారుల బండారం బయటపడాలంటే టెక్నికల్ ఆడిట్ ఒక్కటే మార్గమని నిపుణులు సూచిస్తున్నారు.ప్రస్తుతం ఈ ఫైల్ ఢిల్లీలోని ఉన్నతాధికారుల పరిశీలనలో ఉంది. ఒకవేళ విచారణలో అక్రమాలు జరిగినట్లు తేలితే, సంబంధిత అధికారులపై వేటు పడటంతో పాటు టెండర్లను రద్దు చేసే అవకాశం ఉంది. జాతీయ రహదారుల నాణ్యతతో రాజీపడి, ప్రజల ప్రాణాలను పణంగా పెడుతూ సాగుతున్న ఈ రిగ్గింగ్ మాఫియాపై కేంద్రం ఎలాంటి కఠిన చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి. ఈ వ్యవహారం శ్రీ సత్యసాయి జిల్లాలో రియల్ ఎస్టేట్, కాంట్రాక్టు రంగాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది.

# పంట విరామానికి రెడీ అవుతున్న అక్వా

**భీమవరం, జూన్ 1, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించి పెట్టే కీలకమైన ఆక్వా రంగం ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. సిండికేట్‌ల దెబ్బకు కుదేలవుతున్న ఆక్వా రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోకపోతే, రాష్ట్రవ్యాప్తంగా పంట విరామం ప్రకటిస్తామని ఆక్వా రైతుల రాష్ట్ర సమన్వయ కమిటీ అల్టిమేటం జారీ చేసింది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో రాష్ట్ర స్థాయి అత్యవసర సమావేశంలో రైతులు తమ ఆవేదనను, డిమాండ్లను వెల్లడించారు. డాలర్ల పంటగా పేరుగాంచిన ఆక్వా పరిశ్రమను సిండికేట్ వ్యవస్థలు పట్టి పీడిస్తున్నాయి. అమలాపురంలో జరిగిన ఆక్వా రైతు సంఘాల సమావేశంలో రైతులు ముక్తకంఠంతో తమ నిరసనను వ్యక్తం చేశారు. ఎగుమతిదారులు , మేత తయారీదారులు, హేచరీల యజమానులు ఒక సిండికేట్‌గా ఏర్పడి ధరలను శాసిస్తున్నారని, దీనివల్ల సామాన్య రైతు నిలువునా మునిగిపోతున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన స్పందించకపోతే, ఆక్వా సాగును నిలిపివేయడం మినహా తమకు మరో మార్గం లేదని స్పష్టం చేశారు.ఆక్వా సాగులో విత్తనం దశ నుంచే మోసం మొదలవుతోందని రైతులు ఆరోపిస్తున్నారు. కొన్ని హేచరీలు నాణ్యత లేని సీడ్‌ను పంపిణీ చేయడం వల్ల పంట ఆరంభంలోనే దెబ్బతింటోందని వారు పేర్కొన్నారు. దీనికి తోడు, మేత ధరలు అమాంతం పెంచి రైతుల నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల మేత ధరల పెరుగుదలపై రైతులు నిరసన తెలపడంతో, దానికి ప్రతీకారంగా ఎగుమతిదారులు రొయ్యల కొనుగోలు ధరలను కిలోకు రూ. 50 వరకు తగ్గించేశారని, దీనివల్ల టన్నుకు రూ. 50 వేల చొప్పున రైతులు భారీగా నష్టపోతున్నారని గణాంకాలతో వివరించారు.విద్యుత్ సబ్సిడీ విషయంలో కూడా ప్రభుత్వం ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని రైతులు ధ్వజమెత్తారు. ఆక్వా జోన్, నాన్–ఆక్వా జోన్ అనే తేడాలు లేకుండా సాగు చేసే ప్రతి రైతుకు సబ్సిడీ విద్యుత్తును అందించాలని వారు డిమాండ్ చేశారు. గతంలో నిలిపివేసిన నాన్–ఆక్వా జోన్ పరిధిలోని 12 వేల విద్యుత్ కనెక్షన్లకు సబ్సిడీని తక్షణమే పునరుద్ధరించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పరిమితులు ఆక్వా సాగును మరింత భారంగా మారుస్తున్నాయని, ఇది అంతర్జాతీయ మార్కెట్‌లో మన రొయ్యల పోటీతత్వాన్ని దెబ్బతీస్తుందని హెచ్చరించారు.రాష్ట్రవ్యాప్తంగా ఆక్వా రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రాష్ట్ర ఆక్వా రైతు సమన్వయ కమిటీ ని ఈ సమావేశంలో ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి అధ్యక్షుడిగా గొట్టిముక్కల గాంధీ భగవాన్ రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చిన ఆక్వా ప్రతినిధులు ఈ కమిటీ ద్వారా ప్రభుత్వానికి ఒక సమగ్ర నివేదికను సమర్పించనున్నారు. ఇచ్చిన గడువులోగా సమస్యలు పరిష్కారం కాకపోతే, రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆక్వా సాగును నిలిపివేసి నిరసన తెలుపుతామని వారు తేల్చిచెప్పారు. భీమవరం, కోనసీమ, కైకలూరు, ప్రకాశం, ఏలూరు వంటి ప్రధాన ఆక్వా సాగు జిల్లాల నుంచి భారీగా రైతు నాయకులు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వంపై తాము ఎన్నో ఆశలు పెట్టుకున్నామని, కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏమాత్రం మారలేదని వారు విమర్శించారు. ఎగుమతిదారుల ఆగడాలను కట్టడి చేయకపోతే, రాబోయే రోజుల్లో ఏపీ ఆక్వా రంగం కుప్పకూలడం ఖాయమని హెచ్చరిస్తున్నారు.

## చిరంజీవితో చేయాలని ఉంది

**హైదరాబాద్, జూన్ 1, పెన్ పవర్:** రాజకీయంగా మాజీమంత్రి రోజా దూకుడు స్వభావంతో ఉంటారు. రాజకీయ ప్రత్యర్థులను విపరీతంగా ద్వేషిస్తుంటారు. ముఖ్యంగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై ఆమె వాడే భాష, పదప్రయోగం తీవ్రంగా ఉంటుంది. ఇటీవల మెగా ఫ్యామిలీ పై కూడా ఆమె తరచూ వ్యాఖ్యానాలు చేస్తుంటారు. వారికి మద్దతుగా నిలిచే బుల్లితెర నటులపై కూడా నోరు పారేసుకున్న సందర్భాలు ఉన్నాయి. అయితే రాజకీయంగా విభేదించే రోజా సినిమాల పరంగా మాత్రం మెగా ఫ్యామిలీ వైపు మొగ్గు చూపుతుండడం విశేషం. మెగా ఫ్యామిలీతోనే తన సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభిస్తే బాగుంటుందన్న అభిప్రాయం ఆమె నోటి నుంచి వస్తోంది. చిరంజీవి అవకాశం ఇస్తే సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభిస్తానని ఆమె చెప్పుకు రావడం విశేషం.ప్రముఖ జర్నలిస్టు జాఫర్ హోస్ట్ గా వ్యవహరిస్తున్న బుల్లితెర కార్యక్రమానికి వచ్చారు మాజీ మంత్రి రోజా. ఆయన పలు ప్రశ్నలు వేశారు. సినిమా రంగంలో ఉన్న ఆ నలుగురు అగ్ర కథానాయకులు ఎవరితో సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభిస్తారని ప్రశ్నించారు. మారు మాట చెప్పకుండా మెగాస్టార్ చిరంజీవి అంటూ తేల్చి చెప్పారు రోజా. ఆయనతో అయితే డాన్స్ పోటీపడి చేయవచ్చని చెప్పుకొచ్చారు. బాలకృష్ణ అంటే వ్యక్తిగతంగా ఇష్టం కానీ.. చిరంజీవితో నటించడం అంటేనే తనకు ఆసక్తి అని నిర్మొహమాటంగా చెప్పేశారు. నాగార్జునకు తాను అభిమానిని.. ఆయనతో నటించిన అని చెప్పారు. వెంకటేష్ తో ఒకే ఒక్క సినిమా మాత్రమే చేశానని.. ఆయన విషయంలో సైతం ఆప్షన్ లేదని తేల్చి చెప్పారు రోజా.వాస్తవానికి మెగాస్టార్ చిరంజీవితో రోజాకు మంచి అనుబంధమే ఉండేది. ఆయనతో కలిసి పలు హిట్ చిత్రాల్లో నటించారు. మంత్రిగా ఎంపికైన తర్వాత చిరంజీవి ఆశీర్వాదం కూడా తీసుకున్నారు.. మరో మెగా బ్రదర్ నాగబాబుతో సుదీర్ఘకాలం ఈటీవీ జబర్దస్త్ కార్యక్రమంలో జడ్జిగా కొనసాగారు. అయితే పవన్ కళ్యాణ్ పార్టీ ఏర్పాటు చేసిన నాటి నుంచి ఆయనను వ్యక్తిగతంగా టార్గెట్ పెట్టుకుంటూ వస్తున్నారు. మధ్య మధ్యలో మెగా ఫ్యామిలీ పై సైతం అనుచిత వ్యాఖ్యలు చేసిన సందర్భాలు ఉన్నాయి. కానీ సినిమాల పరంగా చిరంజీవి ద్వారా రీఎంట్రీ ఇవ్వాలన్న ఆలోచనతో రోజా ఉన్నారు. మరి అందుకు చిరంజీవి అవకాశం ఇస్తారో లేదో చూడాలి

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# అభిషేక్ పై దాడి ఎపిసోడ్ : బెంగాల్ రాజకీయాల్లో బిగ్ ఛేంజ్?



పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో వేడి చల్లారడం లేదు. ఇటీవల తృణమూల్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, ఎంపీ అభిషేక్ బెనర్జీపై సోనార్‌పూర్‌లో జరిగిన దాడితో రాష్ట్ర రాజకీయాలు కీలక మలుపు తిరిగాయనే విశ్లేషణలు వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత తీవ్ర నైరాశ్యంలో ఉన్న టీఎంసీ శ్రేణులకు ఈ ఘటన ఒక కొత్త అస్త్రాన్ని అందించిందని చెబుతున్నారు. అంతేకాకుండా ఈ దాడిని 1990లో మమతా బెనర్జీపై జరిగిన ప్రాణాంతక దాడితో పోలుస్తుండటంతో పొలిటికల్ సర్కిల్స్ లో హాట్ డిబేట్ కొనసాగుతోంది. అయితే, 1990 నాటి పరిస్థితులకు, ఇప్పటి రాజకీయాలకు చాలా తేడా ఉందంటున్నారు విశ్లేషకులు. అయినప్పటికీ, దెబ్బతిన్న టీఎంసీని మళ్లీ లైన్లోకి తెచ్చేందుకు ఈ ఘటన ఉపయోగపడే అవకాశం ఉందని వ్యాఖ్యానిస్తున్నారు.

**1990లో ఏం జరిగింది?**

1990 ఆగస్టు 16న కోల్‌కతాలోని హజ్రా క్రాసింగ్‌లో అప్పటి సీపీఐ(ఎం) యువజన విభాగం శ్రేణులు మమతా బెనర్జీపై లాఠీలతో ఘోరంగా దాడి చేశారని పరిశీలకులు చెబుతున్నారు. ఆ దాడిలో ఆమె తలకు తీవ్ర గాయమైంది. నెల రోజుల పాటు ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడిన మమత, కోలుకున్నాక ఆ గాయాలనే తన రాజకీయ అస్త్రంగా మార్చుకున్నారని గుర్తు చేస్తున్నారు. తలకు తెల్లటి బ్యాండేజ్‌తోనే ఆమె ప్రజల్లోకి వెళ్లారు. ఆ విజువల్స్ బెంగాల్ ప్రజల్లో విపరీతమైన సానుభూతిని తెచ్చిపెట్టాయి. ఇక అదే సమయంలో కాంగ్రెస్ అగ్రనాయకత్వం తనకు అండగా నిలబడలేదని భావించిన మమత, ఆ కసితోనే 1998లో తృణమూల్ కాంగ్రెస్ స్థాపించి బెంగాల్‌లో లెఫ్ట్ ఫ్రంట్ కోటను బద్దలు కొట్టారని అంటున్నారు. కేవలం 1990 మాత్రమే కాదు, 2021 ఎన్నికల సమయంలో కాలికి గాయమైనా వీల్‌చైర్‌లోనే ప్రచారం చేసి మమత విజయం సాధించారు. ఈ పరిణామాలతో రాజకీయ దాడులను సానుభూతిగా మార్చుకోవడంలో దీదీది ప్రత్యేక శైలి అనుసరిస్తారని చెబుతున్నారు. కాగా, ఇప్పుడు అభిషేక్ బెనర్జీపై సోనార్‌పూర్‌లో గుడ్లు, రాళ్లు, చెప్పులతో దాడి జరిగిందని అంటున్నారు. అయితే ఆయన క్రికెట్ హెల్మెట్ ధరించి ఉండటం వల్ల పెద్ద ప్రమాదం తప్పింది. కానీ, మమతా బెనర్జీ నాటి పోరాటానికి, నేటి అభిషేక్ పరిస్థితికి చాలా వ్యత్యాసాలు ఉన్నాయని వ్యాఖ్యానిస్తున్నారు. 1990లో మమతా బెనర్జీ ఎటువంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా, క్షేత్రస్థాయి నుంచి ఒంటరిగా పోరాడి పైకొచ్చిన లీడర్. దీంతో ఆమెపై జరిగిన దాడిపై సానుభూతి వచ్చిందని అంటున్నారు. కానీ అభిషేక్ బెనర్జీ అలా కాదని, ఆయన మమత మేనల్లుడు కావడం వల్ల పార్టీలో నంబర్–2 స్థానం నేరుగా లభించిందని చెబుతున్నారు. నాటి కాలంలో అధికార పక్షం (లెఫ్ట్) పై వ్యతిరేకత ఉండేదని, కానీ ఇప్పుడు టీఎంసీపై 15 ఏళ్ల యాంటీ–ఇంకంబెన్సీ ఉండటంతో నాటి ఘటనకు ప్రస్తుత దాడికి ఎటువంటి సారూప్యత లేదని వ్యాఖ్యానిస్తున్నారు. అంతేకాకుండా సోనార్‌పూర్‌లో దాడి జరిగినప్పుడు జనం “దొంగ, దొంగ” అని నినాదాలు చేయడం చూస్తే అభిషేక్ బెనర్జీపై వారికి ఎలాంటి సానుభూతి లేదని అర్థమవుతోందని వ్యాఖ్యానిస్తున్నారు. దీనిని ఆసరగా చేసుకున్న అధికార పక్షం, అభిషేక్ పై దాడిని రాజకీయ కుట్ర కంటే కూడా స్థానిక ప్రజల ఆగ్రహంగా చూపే ప్రయత్నం చేస్తోందని అంటున్నారు. అయితే, ఈ సంక్షోభ సమయాన్ని కూడా మమతా బెనర్జీ తనదైన శైలిలో అనుకూలంగా మార్చుకునేందుకు 3 వ్యూహాలను సిద్ధం చేశారని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ప్రధానంగా ఓటమితో జాతీయ స్థాయిలో ఒంటరి అయినట్లు కనిపించిన మమత తిరిగి పుంజుకునే ప్రయత్నం మొదలుపెట్టారని అంటున్నారు. ఇందులో భాగంగానే ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ వెంటనే స్పందిస్తూ, అభిషేక్ పై దాడిని కక్ష సాధింపు రాజకీయంగా ఖండించారని చెబుతున్నారు. మరోవైపు పాలక బీజేపీ ప్రభుత్వాన్ని ఆదిలోనే దెబ్బతీసేందుకు మమత ఈ దాడిని ఉపయోగించుకుంటున్నారని అంటున్నారు. ఎంపీ, పార్టీ ప్రధాన కార్యదర్శిని చంపే కుట్రలో భాగంగానే భద్రతా సిబ్బందిని తగ్గించేశారని, పాలకులే హంతకులుగా మారారని మమత ఘాటైన విమర్శలతో విరుచుకుపడటం కూడా బెంగాలీలను ఆలోచనకు గురిచేస్తోందని అంటున్నారు. ఇలా ప్రచారం చేయడం ద్వారా ఎన్నికల్లో ప్రజల ఆగ్రహంతో ఎదురైన ఓటమి నుంచి వీలైనంత త్వరగా బయటపడొచ్చని మమత వ్యూహంగా కనిపిస్తోందని చెబుతున్నారు. ఇక తాజా పరిణామాల ద్వారా ఎన్నికల ఓటమితో నైరాశ్యంలో ఉన్న టీఎంసీ శ్రేణులను రోడ్డుపైకి తెచ్చేందుకు ఇదొక పెద్ద అవకాశంగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారని కూడా అంటున్నారు. బెంగాల్ వ్యాప్తంగా నిరసనలు, ర్యాలీలు చేపట్టడం ద్వారా క్షేత్రస్థాయి కార్యకర్తల్లో మళ్లీ జోష్ నింపేందుకు పార్టీ ఈ అవకాశాన్ని వాడుకుంటోందని చెబుతున్నారు. మొత్తానికి అభిషేక్ బెనర్జీపై దాడిని రాజకీయంగా వాడుకునేలా మమత పక్కా వ్యూహంతో పనిచేస్తున్నారని విశ్లేషిస్తున్నారు.

# ‘ఒక్క మాట చెబితే సీఎం విజయ్ ఇంటికి వచ్చి డిప్యూటీ సీఎంను చేసేవారు’

“నేను అనుకుంటే సీఎం విజయ్ ను కలవటం పెద్ద విషయమా? నేను కానీ ఒక్క మాట చెప్పి ఉంటే.. విజయ్ స్వయంగా నా ఇంటికి వచ్చి మరీ.. నాకు ఉప ముఖ్యమంత్రి పదవిని ఇచ్చి ఉండేవారు. ఇప్పుడు పదవులు కోసం చాలా మంది ఆయన చుట్టూ పరుగులు తీస్తున్నారు. నేను చెప్పింది పచ్చి నిజం. డీఎండీకే ఎప్పుడూ పదవుల కోసమో.. డబ్బుల కోసమో ఆశపడే పార్టీ కాదు. నమ్ముకున్న సిద్ధాంతాలకు.. కూటమి ధర్మానికి కట్టుబడి ఉండే పవిత్రమైన పార్టీ” ఈ వ్యాఖ్యలు తమిళనాడులో ఇప్పుడు హాట్ టాపిక్ గా మారితే.. తమిళ రాజకీయాల మీద ఆసక్తి ఉన్న వారిలో ఈ వ్యాఖ్యల మీద పలు ప్రశ్నలు తలెత్తుతున్న పరిస్థితి. ఇవేమీ తెలియని వారు మాత్రం.. ఆమె అడిగితే తమిళనాడు ముఖ్యమంత్రి తన ఇంటికి వచ్చి ఉప ముఖ్యమంత్రి పదవి ఇస్తారా? అదెలా? అన్న సందేహాలకు గురవుతున్నారుఈ సందేహాలు తీరాలంటే కాస్త వెనక్కి వెళ్లాల్సి ఉంటుంది. ఈ సంచలన వ్యాఖ్యలు చేసింది మరెవరో కాదు ఒకప్పుడు తమిళ సినిమాల్లో అగ్ర హీరోల్లో ఒకరిగా వ్యవహరించిన విజయ్ కాంత్ అలియాస్ కెప్టెన్ ఉన్నారు కదా? ఆయన సతీమణే ఈ వ్యాఖ్యలు చేశారు. ఆమె పేరు ప్రేమలత. ఆమె విజయ్ కాంత్ స్థాపించిన డీఎండీకే పార్టీకి ప్రస్తుతం ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె పార్టీ నుంచి గెలిచిన ఏకైక ఎమ్మెల్యే ఆమె ఒక్కరే. అంటే.. ఆ పార్టీకి సింగిల్ ఎమ్మెల్యే.. అది కూడా ఆమె మాత్రమే ఉన్నారు. అయితే.. ఆమె పార్టీ డీఎంకే కూటమిలో ఉన్నారు.

మరి..ఆమె అడిగితే సీఎం విజయ్ ఇంటికి వెళ్లి మరీ ఉప ముఖ్యమంత్రి పదవి ఇస్తారా? అంటే.. ఇవ్వొచ్చనే మాటే బలంగా వినిపిస్తుంది. ఎందుకుంటే..విజయ్ కాంత్ కుటుంబంతో సీఎం విజయ్ కు ఉన్న బంధం అలాంటిది. కానీ.. రాజకీయ పరంగా వారి భావజాలాలు వేరు. ఆమె డీఎంకే కూటమిలో ఉంటే.. విజయ్ తన సొంత పార్టీని మరే కూటమిలోనూ భాగస్వామిని చేయలేదు. అధికారానికి అవసరమైన ఎమ్మెల్యేల కోసం కొన్ని పార్టీలతో జట్టు కట్టి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు.

ఆసక్తికరమైన అంశం ఏమంటే.. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన విజయ్.. ఆ తర్వాత తన ప్రభుత్వానికి తగిన బలం ఉందన్న విషయాన్ని అసెంబ్లీలో నిరూపించుకునే సమయంలో.. ప్రేమలత విపక్ష డీఎంకేతో కలిసి సభ నుంచి వాకౌట్ చేశారే తప్పించి.. ఓటింగ్ లో పాల్గొనలేదు. తన వ్యాఖ్యలతో ఇప్పటివరకు వస్తున్న ఊహాగానాలకు ఆమె తెర దించారని చెబుతున్నారు. విజయ్ కాంత్ కుటుంబంతో సీఎం విజయ్ కు ఉన్న అనుబంధం నేపథ్యంలో కెప్టెన్ సతీమణి కం డీఎండీకే ప్రధాన కార్యదర్శి అధికారపక్షంలోకి వెళతారని.. తాను ఎన్నికల్లో పోటీ చేసే సమయంలో ఉన్న డీఎంకే కూటమి నుంచి బయటకు వస్తారన్న ప్రచారానికి తెర దించారు. డీఎండీకే మద్దతు ఇవ్వనప్పటికి కాంగ్రెస్.. ఇతర పార్టీల మద్దతుతో తమ ప్రభుత్వానికి తగిన బలం ఉందన్న విషయాన్ని అసెంబ్లీలో నిరూపించుకోవటం తెలిసిందే. సీఎం విజయ్ తన సినీ కెరీర్ ప్రారంభంలో విజయ్ కాంత్ ఎంతో సాయం చేశారు. విజయ్ తండ్రి చంద్రశేఖర్ దర్శకత్వంలో విజయ్ కాంత్ నటించటమే కాదు.. విజయ్ హీరోగా నిలదొక్కుకోవటానికి తన సింధూరపొండి సినిమాలో తనతో పాటు స్క్రీన్ షేర్ చేసుకునే అవకాశాన్ని ఇచ్చారు. విజయ్ కాంత్ కుటుంబంపై విజయ్ కు ఎంతో గౌరవం ఉందని చెబుతారు. ఇదే అంశాన్ని తనదైన శైలిలో ప్రేమలత ప్రస్తావించారని చెప్పాలి. ఆమె తాజా వ్యాఖ్యల్లో ఒకఆసక్తికర కోణం ఉంది. అదేమంటే..తమ కుటుంబంతో సీఎం విజయ్ ఎంతో గౌరవ మర్యాదలతో వ్యవహరిస్తారని చెప్పటమే కాదు.. అలాంటి పరిస్థితి ఉన్నప్పటికీ.. పదవుల కోసం ఆశ పడకుండా పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా తాను ఉన్న కూటమిలోనే కొనసాగుతానన్న విషయాన్ని స్పష్టం చేసినట్లైంది.

# జనసేన సభకు అనుమతి నో !



తెలంగాణాలో హైదరాబాద్ రాజధానిగా గచ్చీబౌలీలో జనసేన నవ నిర్మాణ సభని నిర్వహించాలని నిర్ణయించింది. తెలంగాణా ఆవిర్భావ దినోత్సవ వేడుకులను దృష్టిలో ఉంచుకుని జనసేన నిర్వహిస్తున్న ఈ సభ మీద అందరి దృష్టి కేంద్రీకృతం అయింది. అదే సమయంలో ఈ సభను పెట్టే టైం టైమింగ్ మీద కూడా పెద్ద ఎత్తున చర్చ అలాగే రాజకీయ రచ్చ కూడా సాగింది. ఈ నేపథ్యంలో జనసేన సభకు అనుమతిని నిరాకరిస్తూ తెలంగాణా పోలీసులు కీలక నిర్ణయం తీసుకోవడం సంచలనంగా మారింది.

**కొద్ది రోజుల ముందు నుంచి :**

సాధారణంగా రాజకీయ పార్టీలు ఎక్కడైనా సభను జరుపుకునే హక్కుని స్వేచ్ఛను కలిగి ఉంటాయి. జనసేన విషయం తీసుకుంటే కొద్ది రోజుల ముందు ఈ సభను నిర్వహిస్తామని కూడా ప్రకటించింది. ఈ సభ కూడా గచ్చీబౌలీ లోని సంధ్యా కన్వెన్షన్ హాలులో నిర్వహించనున్నారు. ఇది ఓపెన్ గా నిర్వహించే సభ కాదు, ఇండోర్ మీటింగ్. అయినా దానికి అనుమతి నిరాకరించడం పట్ల చర్చ సాగుతోంది.

**నేపథ్యం చూస్తే :**

ఇదిలా ఉంటే ఇటీవల తెలంగాణా మేధావులు ప్రజా సంఘాలు కొందరు ప్రెస్ క్లబ్ లో ప్రొఫెసర్ నాగేశ్వర్ కి మద్దతుగా మాట్లాడుతూ జనసేన మీద పవన్ మీద తీవ్ర విమర్శలు చేశారు. ఆ వేడి అలా కంటిన్యూ అవుతోంది. ఈ నేపథ్యంలోనే జనసేన తెలంగాణా శాఖ ఒక సభను నిర్వహించుకుంటామని ప్రకటించింది. అయితే ఒక వైపు తెలంగాణా ఫార్మేషన్ డే మరో వైపు పవన్ మీద తెలంగాణావాదులు తీవ్ర విమర్శలు చేయడం ఆంధ్రా తెలంగాణా అంటూ విభజన రేఖ గీసి మరీ హాట్ కామెంట్స్ చేయడం జరుగుతూ వస్తోంది. మంత్రి పొన్నం ప్రభాకర్ అయితే నవ నిర్మాణ సభ మీద విమర్శలు చేశారు. పవన్ గురించి కూడా కామెంట్స్ చేశారు. ఇంకో వైపు తెలంగాణా రక్షణ సేన అధ్యక్షురాలు కవిత కూడా ఏపీలో సభ పెట్టుకోవాలి తప్పించి తెలంగాణాలో కాదని చెప్పారు. అదే విధంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నేతలు కూడా విమర్శలు చేయడంతో వాతావరణం అయితే హీటెక్కింది. ఈ నేపథ్యంలో జనసేన సభకు అనుమతి నిరాకరణ అయింతే చర్చనీయాంశం అయింది.

**జనసేన ఫైర్ :**

తమ సభను గచ్చీ బౌలీ సంధ్య కన్వెన్షన్ హాలులో నిర్వహించుకోవడానికి కూడా అనుమతి నిరాకరించడం పట్ల జనసేన సామాజిక మాధ్యమం ద్వారా ఫైర్ అయింది. కేవలం పార్కింగ్ సమస్యను సాకుగా చూపించి అనుమతికి నో చెప్పడం సరికాదు అని పేర్కొంది. ప్రతీ రోజూ ఎన్నో సమావేశాలు ఆ కన్వెన్షన్ హాలు వద్ద జరుగుతాయని కూడా తెలిపింది. ఇండోర్ మీటింగ్ కి అనుమతి ఇవ్వకపోవడం బాధాకరం అని జనసేన ఆవేదన వ్యక్తం చేసింది. తెలంగాణాలో ఉన్న కొండగట్టు ఆలయానికి పవన్ సొంత సొమ్ము విరాళంగా ఇచ్చినపుడు లేని ప్రాంతీయ సెంటిమెంట్లు జనసేన పుట్టిన నేలలో ఆ పార్టీ నేతలు సమావేశం అయితే వస్తున్నాయా అని ప్రశ్నించింది.

**న్యాయ పోరాటం :**

ఇక ఈ విషయం మీద జనసేన పట్టుదలగా ఉందని అంటున్నారు. కోర్టు ద్వారా అనుమతి తెచ్చుకోవాలని చూస్తోంది అని కూడా ప్రచారం సాగుతోంది. అయితే ఈ విషయంలో ఏమి చేస్తారు అన్నది చూడాల్సి ఉంది. టైం చూస్తే చాలా తక్కువగా ఉంది. చివరి నిముషం వరకూ సభకు అనుమతి వస్తుందని తెలంగాణా జనసేన నేతలు అంతా భావించారు. అయితే ఇపుడు కేవలం కొద్ది గంటలు ఉంది అనగా నో చెప్పారు దాంతో న్యాయపరంగా ఏమైనా ఆలోచనలు చేస్తారా అన్నది అయితే చర్చగా ఉంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# కన్నతల్లి ఒడిలోనే రక్షణ లేదా?.. కన్నీళ్లు తెప్పిస్తున్న ఒకటిన్నర సంవత్సర బాలుడి విషాద గాథ!



సమాజం తలదించుకునే ఒక అత్యంత అమానుషమైన ఘటన కేరళలో వెలుగుచూసింది. కేవలం ఒకటిన్నరేళ్ల పసికందుపై కన్నతల్లి, ఆమె రెండో భర్త కలిసి చేసిన చిత్రహింసలు వింటే ఒళ్లు గగుర్పొడుస్తుంది. నిరంతరం సాగిన శారీరక దాడి తట్టుకోలేక ఆ పసి ప్రాణం గాల్లో కలిసిపోయింది. ప్రతి ఒక్కరినీ తీవ్రంగా చలింపజేసిన ఈ గుండెలవిసే దారుణ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం.

**అన్నం తింటూ పడిపోయాడని డ్రామాలు:**

కేరళలోని నెడుమంగాడ్‌లో ఈ ఘోరం జరిగింది. ఒకటిన్నరేళ్ల చిన్నారి అర్షిద్ ఇంట్లో అన్నం తింటూ అకస్మాత్తుగా స్పృహతప్పి పడిపోయాడంటూ ఆసుపత్రికి తరలించారు. అయితే శనివారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆ చిన్నారి ప్రాణాలు విడిచాడు. ఇక బాబు మృతిపై అనుమానం రావడంతో పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టగా అసలు నిజాలు బయటపడ్డాయి.

**పోస్ట్‌మార్టంలో తేలిన భయంకర నిజాలు:**

బాబు మృతదేహానికి నిర్వహించిన పోస్ట్‌మార్టం రిపోర్ట్ చూసి డాక్టర్లు, పోలీసులు సైతం షాక్‌కు గురయ్యారు. ఆ చిన్నారి శరీరంపై ఏకంగా 51 గాయాలు ఉన్నట్లు తేలింది. గుప్తాంగాలపై గాయాలు, సిగరెట్ కాలిన గుర్తులు, అంతర్గత రక్తస్రావం, పాత ఫ్రాక్చర్లు ఉన్నట్లు పోస్ట్‌మార్టంలో బయటపడింది. బాబుది సహజ మరణం కాదని, రోజూ దారుణంగా కొట్టడం వల్లే చనిపోయాడని నిర్ధారణ అయ్యింది.

**కన్నతల్లి, సెంకడ్ హస్బెండ్ అరెస్ట్:**

ఈ దారుణానికి ఒడిగట్టిన చిన్నారి తల్లి అఖిల, ఆమె రెండో భర్త అష్కర్‌లను పోలీసులు వెంటనే అరెస్ట్ చేశారు. ఇక నెడు మంగాడ్ డీఎస్పీ నేతృత్వంలో వీరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అంతకు ముందే బాబు తాతమ్మ, నానమ్మలు బాబు ప్రాణాలకు ముప్పు ఉందని గ్రహించి, తమకు కస్టడీ ఇవ్వాలని కోరినట్లు సమాచారం. కానీ, అంతలోనే ఈ ఘోరం జరిగిపోయింది.

**ప్రభుత్వం సీరియస్: కఠిన చర్యలు:**

ఈ హృదయ విదారక ఘటనపై కేరళ మంత్రి బిందు కృష్ణ తీవ్రంగా స్పందించారు. ఒకటిన్నరేళ్ల పసికందును తల్లి, సవతి తండ్రి ఇంత

దారుణంగా హింసించి చంపడం రాష్ట్రంపై జరిగిన నేరంగా పరిగణిస్తున్నామని చెప్పారు. ఇక ఇలాంటి చైల్డ్ అబ్యూస్ ఘటనల పట్ల ప్రభుత్వం జీరో టాలరెన్స్ విధానాన్ని పాటిస్తుందని, పిల్లల రక్షణ కోసం మరిన్ని కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**పసిప్రాణానికి దక్కని రక్షణ:**

అమ్మ ఒడిలో సురక్షితంగా ఉండాల్సిన పసికందు, కన్నతల్లి చేతిలోనే బలైపోవడం సమాజంలో మానవత్వం ఎంత దిగజారిపోయిందో చూపిస్తోంది. ఇక ప్రస్తుతం ఆ బాబు మృతదేహాన్ని పలోడ్‌లోని అతని అసలు తండ్రి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అమాయక పసిప్రాణాన్ని బలితీసుకున్న ఆ కిరాతకులకు చట్టం ప్రకారం అత్యంత కఠినమైన శిక్ష పడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు..

# పవన్ నవ నిర్మాణ సభతో రచ్చ రచ్చ.. టీఆర్ఎస్ చీఫ్ కవిత హాట్ కామెంట్స్

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ లో నిర్వహించనున్న ‘తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ’ రాజకీయంగా తీవ్ర దుమారానికి కారణమవుతోంది. ఇప్పటికే ఈ సభను నిరసిస్తూ కాంగ్రెస్ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర విమర్శలు చేశారు. మరోవైపు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత కూడా గొంతు విప్పారు. డిప్యూటీ సీఎం పవన్ పై తీవ్ర విమర్శలు చేసిన కవిత.. తమ రాష్ట్రంలో ఆంధ్రా రాజకీయ నాయకులు పెత్తనం చేస్తామంటే సహించేది లేదని తేల్చిచెప్పారు. రాజధాని కట్టడం చేతకాని వారు తెలంగాణను పునర్ నిర్మిస్తారా? అంటూ మండిపడ్డారు.

తమకు ఏపీ ప్రజలతో విభేదాలు లేవని స్పష్టం చేసిన కవిత, ఆంధ్ర నాయకులతోనే పంచాయితీ ఉందంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ‘ఎక్కడ పడితే అక్కడ ఆంధ్ర వాళ్ళ విగ్రహాలు పెడుతున్నారని, అధికారంలోకి వచ్చాక ఆ విగ్రహాలను కూల్చివేస్తామని హెచ్చరించారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రత్యేక రాష్ట్రం కోసం తెలంగాణ వాదులు ఎప్పుడు విమర్శలు చేసినా, ప్రాంతానికి అన్యాయం జరిగిందని మాత్రమే చెప్పేవాళ్లమని అన్నారు. ఆంధ్ర ప్రజలను ఎప్పుడూ ఏమీ అనలేదని గుర్తు చేశారు. ప్రజలకు ప్రజలకు మధ్యలో ఎప్పుడు పంతాలు, పట్టింపులు, కొట్లాటలు ఉండవని స్పష్టం చేశారు. అదే సమయంలో ప్రజల మధ్య చుట్టరికాలు ఉంటాయన్నారు.



**ఆంధ్ర ఏజెంట్ సీఎం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్ర రాజకీయ నాయకుల ఏజెంట్‌గా పనిచేస్తున్నారని టీఆర్ఎస్ నాయకురాలు కవిత విమర్శించారు. ఎక్కడ పడితే అక్కడ అడ్డగోలుగా ఆంధ్రోళ్ళ విగ్రహాలు పెడుతున్నారని ధ్వజమెత్తారు. “నేనైతే పాత నాయకులంతా మంచిదానిని కాదు.. ఇట్లనే మీరు చేస్తే మేము కచ్చితంగా అధికారంలోకి వస్తాం, అన్ని విగ్రహాల పలగొట్టి ఆంధ్రాకి పార్సిల్ చేస్తాం” అంటూ కవిత వార్నింగ్ ఇచ్చారు. తనకు పెద్దగా ఓపిక గానీ, విశాల హృదయం కానీ లేదని స్పష్టం చేశారు. ఆంధ్రా వాళ్లు రావొచ్చు పోవచ్చు రొయ్యలు అమ్ముకోవచ్చు, షూటింగులు చేసుకోవచ్చు. సినిమాలు తీసుకోవచ్చు అంటూ వ్యాఖ్యానించారు కవిత.

**వ్యాపారవేత్తలకు వెల్ కం**

ఏపీ రాజకీయ నాయకులకు తెలంగాణలో ఏం పని అంటూ ప్రశ్నించిన కవిత అదే సమయంలో ఏపీకి చెందిన వ్యాపార వేత్తలు, పారిశ్రామిక వేత్తలు వస్తామంటే ఎర్ర తివాచీ వేసి స్వాగతం చెబుతామన్నారు. ఎందుకంటే స్విట్జర్లాండ్, యూకే, జపాన్ వంటి విదేశీ వ్యాపారవేత్తల కాళ్ళు పట్టుకొని రాండయ్యా భూములు ఇస్తామనే కన్నా, పెట్టుబడులు పెట్టే ఏపీ వారిని స్వాగతించడం మేలని వ్యాఖ్యానించారు. ఏపీలో శేఖర్ రెడ్డి అనే పారిశ్రామిక వేత్త శ్రీసిటీ కట్టారని, 30 దేశాల నుంచి పరిశ్రమలు వస్తున్నాయని చెప్పారు. శేఖర్ రెడ్డి లాంటి వారు వస్తే తెలంగాణకు 60 దేశాల పరిశ్రమలు వస్తాయన్నారు.

**రాజధాని కట్టుకోలేకపోయారు**

ఏపీలోని రెండు పార్టీల వారు రాజధాని కట్టుకోలేకపోయారని కవిత ఎత్తిచూపారు. రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం వద్దంటూ తాము పోరాడుతుంటే, ఏపీ నేతలు మాత్రం అసెంబ్లీ తీర్మానంతో చేసుకోవాల్సిన రాజధానిని పార్లమెంటు ద్వారా గెజిట్ చేయించారని అన్నారు. గతంలో కర్నూలులో గుడారాల మధ్య ఉన్న రాజధానిని హైదరాబాద్ కు తరలించేందుకు తెలంగాణతో కలిశారని కవిత ఆరోపించారు. రెండు రాష్ట్రాలు అయ్యాక రాజధాని కట్టుకోవడంలో రెండు పార్టీలు విఫలమయ్యాయని అన్నారు. కానీ, మీ రాజకీయ అవసరాల కోసం తెలంగాణను వాడుతున్నారంటూ ఆక్షేపించారు. ఇది కరెక్ట్ కాదు, మేము గమనిస్తున్నాం. తెలంగాణవాదులం, రాజకీయంగా పరిణతి చెందినటువంటి వాళ్ళం అంటూ కవిత వ్యాఖ్యానించారు.

# జూన్ నెల మనీ గేమ్ షురూ.. మీ జేబును శాసించే 5 పెద్ద అప్‌డేట్స్ ఇవే

కొత్త ఆర్థిక సంవత్సరం స్పీడందుకుంది.. క్యాలెండర్‌లో జూన్ 2026 పేజీ ఓపెన్ అయిపోయింది. జూన్ నెల మీ జేబుకు, మంత్లీ బడ్జెట్‌కు, మీ ఇన్వెస్ట్‌మెంట్లకు అత్యంత కీలకమైనదిగా మారబోతోంది. మీరు ఉద్యోగస్తులైనా, హోమ్ లోన్ ఈఎంఐలు కడుతున్న వారైనా, ఫిక్స్‌డ్ డిపాజిట్లలో డబ్బులు దాచుకున్న వారైనా.. లేదా స్టాక్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్‌లో రోజువారీ ట్రేడింగ్ చేసేవారైనా సరే.. ఈ నెలలో జరగబోయే 5 క్రేజీ ఫైనాన్షియల్ ఈవెంట్స్ పై కన్నేసి ఉంచాల్సిందే. మీ పైసల ప్లానింగ్‌ని పక్కాగా సెట్ చేసే ఆ 5 మేజర్ మనీ అప్‌డేట్స్ ఏంటో ఇప్పుడే చూసేద్దాం..




**1. ఆర్బీఐ పాలసీ మీటింగ్:**
జూన్ 3 నుండి జూన్ 5 వరకు రిజర్వ్ బ్యాంక్ మానిటరీ పాలసీ కమిటీ మీటింగ్ జరగనుంది. ఆర్థిక నిపుణుల అంచనా ప్రకారం.. ఈసారి కూడా రెపో రేటును 5.25% వద్ద స్థిరంగా ఉంచే అవకాశం ఉంది. అయితే వడ్డీ రేట్ల తగ్గింపుపై ఆర్బీఐ ఇచ్చే హింట్స్ ఇక్కడ మోస్ట్ ఇంపార్టెంట్.
ఎవరిపై ఇంపాక్ట్?: హోమ్ లోన్, పర్సనల్ లోన్ తీసుకున్న వారి ఈఎంఐల భవిష్యత్తు దీనిపైనే ఆధారపడి ఉంటుంది. అలాగే ఖీణ ఇన్వెస్టర్లకు వడ్డీ రేట్లు ఎటువైపు వెళ్తాయో ఒక క్లారిటీ వస్తుంది.

**2. అడ్వాన్స్ టాక్స్ డెడ్‌లైన్:**
ఆర్థిక సంవత్సరంలో మీరు కట్టాల్సిన పన్ను అంచనాలు రూ.10వేలు దాటితే.. మీరు అడ్వాన్స్ టాక్స్ కట్టాల్సి ఉంటుంది. దీని మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ గడువు జూన్ 15 అని అస్సలు మర్చిపోవద్దు.
ఎవరిపై ఇంపాక్ట్?: ఫ్రీలాన్సర్లు, వ్యాపారస్తులు, ట్రేడర్లు, కన్సల్టెంట్లు, ఇళ్ల అద్దెల ద్వారా భారీగా ఆదాయం పొందే వారు అలర్ట్‌గా ఉండాలి. డెడ్‌లైన్ మిస్సయితే ఆదాయపు పన్ను చట్టం కింద వడ్డీలు, పెనాల్టీలు మోత మోగుతాయి.

**3. ద్రవ్యోల్బణం లెక్కలు:**
మే నెలకు సంబంధించిన రిటైల్ ద్రవ్యోల్బణం డేటా ఈ జూన్ లోనే రిలీజ్ కానుంది. మార్కెట్ సెంటిమెంట్‌ను శాసించే అంశాల్లో ఇన్‌ఫ్లేషన్ రేటు కూడా కీలకమైనదే.
ఎవరిపై ఇంపాక్ట్?: ధరలు కంట్రోల్‌లో ఉంటే వడ్డీ రేట్లు స్థిరంగా ఉంటాయి. ఒకవేళ ఫుడ్ లేదా క్రూడ్ ఆయిల్ ధరల వల్ల ద్రవ్యోల్బణం పెరిగితే మాత్రం స్టాక్ మార్కెట్లు, డెట్ మ్యూచువల్ ఫండ్స్ కుదుపునకు లోనవుతాయి.

**4. IIP డేటా:**
దేశీయ పారిశ్రామిక ఉత్పత్తి గణాంకాలు కూడా ఈ నెలలోనే విడుదలవుతాయి. మైనింగ్, మానుఫ్యాక్చరింగ్, పవర్ సెక్టార్ల హెల్త్ కండిషన్ ఎలా ఉందో ఇది చెబుతుంది.
ఎవరికి ఇంపాక్ట్?: ఈ గ్రోత్ నంబర్స్ బలంగా ఉంటే ఇన్వెస్టర్లలో జోష్ పెరుగుతుంది. లేదంటే మార్కెట్లలో కాస్త మందగమనం ఉండొచ్చు. లాంగ్ టర్మ్ ఇన్వెస్టర్లకు ఒక మార్గదర్శకంగా నిలుస్తుంది.

**5. గ్లోబల్ క్యూస్:**
దేశీయ మార్కెట్లతో పాటు క్రూడ్ ఆయిల్ ధరలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వ్యాఖ్యలు, కరెన్సీ హెచ్చుతగ్గులు, విదేశీ ఇన్వెస్టర్ల ఫ్లోస్ వంటి గ్లోబల్ అంశాలు ఇండియన్ మార్కెట్‌ను ఎడ్జ్‌లో ఉంచనున్నాయి.
ఎవరిపై ఇంపాక్ట్?: క్రూడ్ ఆయిల్ పెరిగితే ఇంపోర్ట్-డిపెండెంట్ రంగాలు ప్రభావితమవుతాయి. రూపాయి విలువ మారితే అది స్టాక్ మార్కెట్ ఓలటాలిటీని పెంచుతుంది. ఇది మార్కెట్ సెంటిమెంట్లను నేరుగా దెబ్బతీసే అంశం.
జూన్ అంటే కేవలం క్యాలెండర్ మార్పు కాదు.. మీ ట్యాక్స్ రిటర్న్స్, లోన్ ఈఎంఐలు, టాక్స్ ప్లానింగ్‌లను డిసైడ్ చేసే అసలైన మనీ గేమ్. అందుకే అనవసరపు ఆందోళనలతో తప్పుడు ఇన్వెస్ట్‌మెంట్ నిర్ణయాలు తీసుకోకుండా.. పక్కాగా క్యాష్ ఫ్లో ప్లాన్ చేసుకోండి.

# అమెరికా కంపెనీ కాంట్రాక్ట్ కోల్పోయిన HCLTech.. డేంజర్‌లో 200 మంది ఉద్యోగులు




భారతీయ ఐటీ రంగంలో ఉద్యోగాల కోత, క్లయింట్ ఒప్పందాల రద్దు వంటి వార్తలు ఉద్యోగులను మరోసారి ఆందోళనలోకి నెట్టేస్తున్నాయి. దేశీయ ఐటీ దిగ్గజం హెచ్‌సీఎల్‌టెక్ కు గట్టి షాక్ తగిలింది. ప్రముఖ అమెరికన్ టెక్నాలజీ కంపెనీ 'జెరాక్స్ కార్పొరేషన్'తో ఉన్న ఒక కీలకమైన బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ కాంట్రాక్ట్‌ను హెచ్‌సీఎల్‌టెక్ కోల్పోబోతోంది. ఈ ఒప్పందం ఈ జూన్ నెలతో ముగియనుండటంతో.. ఈ ప్రాజెక్టుపై పనిచేస్తున్న సుమారు 200 మంది ఉద్యోగులు లేఆఫ్స్ ముంగిట నిలిచారు. దీర్ఘకాలికంగా కొనసాగుతున్న ఈ కాంట్రాక్ట్ రద్దు కావడం నోయిడా ప్రధాన కేంద్రంగా పనిచేసే హెచ్‌సీఎల్‌టెక్ ఉద్యోగులకు కోలుకోలేని దెబ్బగా మారింది.

**ఫిలిప్పీన్స్‌కు మారిన జెరాక్స్ ప్రాజెక్ట్..**
లాభాల క్షీణతను ఎదుర్కొంటూ, వ్యాపార పునర్నిర్మాణంలో ఉన్న జెరాక్స్ సంస్థ ఖర్చులను తగ్గించుకునే వ్యూహంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకుంది. హెచ్‌సీఎల్‌టెక్‌తో ఉన్న బీపీఎం కాంట్రాక్ట్‌ను రెన్యూవల్ చేయకూడదని జెరాక్స్ భావిస్తోంది. ఈ పనిలో ఎక్కువ భాగాన్ని ఫిలిప్పీన్స్‌లో ఉన్న తమ స్వంత ఇన్-హౌస్ యూనిట్‌కు బదిలీ చేయాలని, మిగిలిన కొద్దిపాటి పనిని అక్కడి స్థానిక థర్డ్ పార్టీ బీపీఎం సంస్థకు అవుట్‌సోర్స్ చేయాలని జెరాక్స్ ప్లాన్ చేస్తోంది.

**ముందే అందిన సంకేతాలు..**
ఈ కాంట్రాక్ట్ ముగిసిపోతుండటంతో అత్యంత ఎక్కువగా నష్టపోతున్నది నోయిడా క్యాంపస్ నుంచి పనిచేస్తున్న ఉద్యోగులేనట. దాదాపు 2 నెలల క్రితమే ఈ ఉద్యోగులకు కంపెనీ వెలుపల కొత్త అవకాశాలను వెతుక్కోవాలని యాజమాన్యం సూచించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో మొదటి విడత పని పూర్తయిందని, దాదాపు 50 మంది ఉద్యోగులు ఇప్పటికే బెంచ్‌కి పరిమితమయ్యారని సమాచారం. దురదృష్టవశాత్తూ వీరిని కంపెనీలోని ఇతర ప్రాజెక్టులలోకి తీసుకునే అవకాశం లేదని స్పష్టం చేయడంతో

**17 ఏళ్ల సుదీర్ఘ బంధంలో కుదుపు..**
జెరాక్స్ సంస్థ హెచ్‌సీఎల్‌టెక్‌కు దాదాపు 17 ఏళ్లుగా అత్యంత కీలకమైన క్లయింట్‌గా కొనసాగుతోంది. ఈ రెండు కంపెనీల మధ్య బిలియన్ డాలర్ల విలువైన సాంకేతిక ఒప్పందాలు ఉన్నాయి. ఇప్పుడు రద్దవుతున్న బీపీఎం కాంట్రాక్ట్ అనేది హెచ్‌సీఎల్‌టెక్ అందిస్తున్న మొత్తం సేవల్లో చిన్న పార్ట్ మాత్రమే. అయినప్పటికీ ఉద్యోగుల తొలగింపు పరంగా ఇది పెద్ద ప్రభావమే చూపుతోంది. ఈ విషయమై హెచ్‌సీఎల్‌టెక్ స్పందిస్తూ.. పాలసీ ప్రకారం క్లయింట్ ఒప్పందాలపై తాము వ్యాఖ్యానించలేమని, అంతర్జాతీయ క్లయింట్లతో తమ బంధం బలంగానే ఉందని పేర్కొంది.

**అమెరికాలోనూ లేఆఫ్స్..**
కేవలం దేశంలోనే కాకుండా అమెరికాలోని ఫ్లోరిడాలో ఉన్న హెచ్‌సీఎల్‌టెక్ అనుబంధ సంస్థలో కూడా లేఆఫ్స్ నడుస్తున్నాయి. ఒక క్లయింట్ ప్రాజెక్ట్ పునర్నిర్మాణంలో భాగంగా ఆర్లాండోలో 120 మంది ఉద్యోగులను తొలగించే ప్రక్రియ మే 29 నుండి ప్రారంభమైంది. ఇది 2026 డిసెంబర్ చివరి వరకు, కొన్ని తొలగింపులు 2027 ప్రారంభం వరకు కొనసాగనున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 60 దేశాల్లో 2.26 లక్షల మందికి పైగా ఉద్యోగులు ఉన్న హెచ్‌సీఎల్‌టెక్‌లో జరుగుతున్న మార్పులు ప్రపంచ ఐటీ మార్కెట్లో నెలకొన్న మందగమనాన్ని, ఆటోమేషన్ అవసరాన్ని సూచిస్తోంది.

# మే నెలలో జీఎస్టీ వసూళ్ల జాతర.. కేంద్ర ఖజానాలోకి ఏకంగా రూ.లక్షా 94వేల కోట్లు

భారత ఆర్థిక వ్యవస్థకు సరికొత్త జోష్ ఇస్తూ జీఎస్టీ వసూళ్లు మరోసారి దుమ్మురులిపేశాయి. పండుగలు ఉన్నా లేకపోయినా.. సామాన్యుల కొనుగోళ్లు, కంపెనీల డిమాండ్ తగ్గకపోవడంతో కేంద్ర ప్రభుత్వ ఖజానా నిండింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది మే నెలలో గ్లోబల్ మార్కెట్ ఒడిదొడుకులను తట్టుకుంటూ మరిన్ని ఎక్కువ పన్ను వసూళ్లను సాధించి భారత్ తన ఆర్థిక సత్తాను చాటిచెప్పింది. ప్రభుత్వ అధికారిక లెక్కల ప్రకారం మే నెలలో ఏకంగా రూ.లక్షా 94వేల కోట్ల స్థూల జీఎస్టీ రెవెన్యూ వసూలైంది. మే 2025లో ఈ వసూళ్లు రూ.లక్షా 88వేల కోట్లుగా ఉండేవి. దానితో పోలిస్తే ఈసారి 3.2 శాతం వృద్ధి నమోదైంది. ఈ భారీ వసూళ్లలో దేశీయ లావాదేవీల ద్వారా సెంట్రల్ జీఎస్టీ రూపంలో రూ.37వేల 397 కోట్లు, స్టేట్ జీఎస్టీ కింద రూ.45వేల 143 కోట్లు, అలాగే ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ ద్వారా రూ.51వేల 990 కోట్లు వచ్చాయి. అయితే అంతకంటే ముందు నెల అయిన ఏప్రిల్‌లో ఆల్‌టైమ్ రికార్డ్ స్థాయిలో రూ.2లక్షల 43వేల కోట్లు, మార్చిలో రూ.2 లక్షల కోట్ల మార్కును దాటిన సంగతి తెలిసిందే. ఆ రికార్డులతో పోలిస్తే మే నెల కలెక్షన్లు కొంచెం తగ్గినప్పటికీ.. మొత్తంగా చూస్తే మాత్రం వసూళ్ల జాతర అదిరిపోయిందనే చెప్పాలి. అసలు జీఎస్టీ వసూళ్లు ఈ రేంజ్‌లో దూసుకుపోవడానికి ప్రధాన కారణం వస్తువులు, సేవల సరఫరా మెరుగుపడటమే. అంతేకాదు విదేశాల నుంచి వచ్చే దిగుమతులపై పన్ను వసూళ్లు కూడా భారీగా పెరిగాయి. దేశీయంగా డిమాండ్ ఎంత బలంగా ఉందో చెప్పడానికి వస్తువుల సరఫరాపై పన్ను 26.9 శాతం పెరగడమే నిదర్శనం.




సర్వీస్ సెక్టార్‌లో కూడా 22.2 శాతం వృద్ధి కనిపించింది. ఇక విదేశీ దిగుమతులపై వచ్చే ఐజీఎస్టీ కలెక్షన్లు 19.1 శాతం పెరిగి రూ.59వేల 654 కోట్లకు చేరాయి. అంటే దేశంలో పారిశ్రామిక రంగానికి సంబంధించిన యాక్టివిటీ ఎంత జోరుగా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు.
కొత్త ఆర్థిక సంవత్సరంలో మొదటి రెండు నెలలైన ఏప్రిల్, మే నెలల కలెక్షన్లను కలిపి చూస్తే.. గతేడాది కంటే 6.2 శాతం వృద్ధితో ఏకంగా రూ.4లక్షల 37వేల కోట్ల జీఎస్టీ వసూలైంది. రీఫండ్స్ అన్నింటినీ మినహాయించిన తర్వాత చూసుకుంటే.. నికర జీఎస్టీ ఆదాయం 3.3 శాతం పెరిగి రూ.లక్షా 67వేల కోట్లుగా నమోదైంది. గతేడాది సెప్టెంబర్ 2025లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణ కూడా ఈ భారీ వసూళ్లకు బాగా హెల్ప్ అయింది. పన్నుల విధానాన్ని సరళతరం చేస్తూ 5%, 18% ప్రధాన స్లాబులుగా మార్చడం, లగ్జరీ వస్తువులపై 40% రేటును పెట్టడం వల్ల సామాన్యులపై భారం తగ్గడమే కాకుండా.. ప్రభుత్వానికి టాక్స్ కలెక్షన్లు కుమ్మేసేలా చేశాయి.

# RBI దగ్గర కుప్పలుకుప్పలుగా బంగారం.. వామ్మో దాని విలువ రూ.11 లక్షల కోట్లా..?



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సరికొత్త రికార్డు సృష్టించింది. దేశ భవిష్యత్తు భద్రత కోసం, ఆర్థిక స్థిరత్వం కోసం ఆర్బీఐ తన వద్ద ఉన్న బంగారం నిల్వలను మునుపెన్నడూ లేనంత భారీగా పెంచుకుంటూ పోతోంది. కేవలం బంగారం నిల్వలను పెంచడమే కాకుండా.. అంతర్జాతీయంగా వస్తున్న మార్పులను గమనిస్తూ మన దేశ సంపదను మన దేశంలోనే దాచుకోవాలనే వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే విదేశాల్లో దాచిన టన్నుల కొద్దీ బంగారాన్ని తిరిగి స్వదేశానికి తరలిస్తూ సంచలన నిర్ణయాలు తీసుకుంటోంది.
ఆర్బీఐ వద్ద ఉన్న నిల్వల వివరాల్లోకి వెళితే.. బ్యాంకింగ్ డిపార్ట్‌మెంట్ పరిధిలోనే ఏకంగా 568.20 టన్నుల భారీ బంగారం నిల్వలు ఉన్నాయి. ఈ నిల్వలు మార్చి 2025 నాటి నుంచి ఎలాంటి మార్పులు లేకుండా స్థిరంగా కొనసాగుతున్నాయి. అయితే ఇక్కడే ఆర్బీఐ ఒక పెద్ద వ్యూహాత్మక మార్పుకు శ్రీకారం చుట్టింది. గతంలో మన దేశానికి చెందిన చాలా వరకు బంగారాన్ని విదేశీ బ్యాంకుల్లో భద్రపరిచేవారు. ప్రస్తుత అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక పరిస్థితులను బట్టి మన దేశ సార్వభౌమాధికారాన్ని, ఆర్థిక రక్షణను చాటిచెప్పేలా ఈ భారీ నిల్వల్లో ఎక్కువ భాగాన్ని సొంత గడ్డపైనే ఉంచాలని కేంద్ర ప్రభుత్వం, ఆర్బీఐ నిర్ణయించాయి.
ఈ కొత్త వ్యూహం ప్రకారం ప్రస్తుతం బ్యాంకింగ్ డిపార్ట్‌మెంట్‌లోని 568.20 టన్నుల బంగారంలో.. ఏకంగా 367.73 టన్నుల బంగారాన్ని దేశంలోనే అత్యంత సురక్షితమైన ప్రదేశాలలో భద్రపరిచారు. కేవలం 200.47 టన్నుల బంగారాన్ని మాత్రమే ప్రస్తుతం విదేశీ బ్యాంకుల్లో ఉంచారు. విదేశాల్లో ఉన్న నిల్వల కంటే మన దేశంలో ఉన్న నిల్వలు భారీగా పెరగడం అనేది భారత ఆర్థిక వ్యవస్థ సాధించిన పెద్ద విజయంగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. మన సంపద మన దేశంలోనే ఉండటం వల్ల ఎలాంటి అంతర్జాతీయ సంక్షోభాలు వచ్చినా మనకు వచ్చే ముప్పేమీ ఉండదనే ధీమా వ్యక్తమవుతోంది.
స్వదేశానికి బంగారాన్ని తరలించే ఈ ప్రక్రియ గత కొన్ని సంవత్సరాలుగా శరవేగంగా సాగుతోంది. ఆర్బీఐ గతంలో కంటే ఇప్పుడే అత్యధిక మొత్తంలో బంగారాన్ని ఇండియాకు తీసుకొచ్చింది.
2023-24 ఆర్థిక సంవత్సరంలో 107.21 మెట్రిక్ టన్నుల బంగారాన్ని, ఆ తర్వాత 2024-25 ఆర్థిక సంవత్సరంలో 103.68 మెట్రిక్ టన్నుల బంగారాన్ని విదేశాల నుండి తిరిగి భారత్‌కు తీసుకొచ్చారు. తాజాగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆర్బీఐ ఏకంగా 168.06 మెట్రిక్ టన్నుల బంగారాన్ని విజయవంతంగా భారతదేశానికి తరలించింది. గడిచిన మూడేళ్లతో పోలిస్తే ఇదే అత్యధికం కావడం గమనార్హం. గ్లోబల్ మార్కెట్‌లో రూపాయి విలువను కాపాడటానికి, ద్రవ్యోల్బణాన్ని తట్టుకోవడానికి ఈ పసిడి నిల్వలు ఆర్బీఐకి కొండంత అండగా నిలుస్తాయి. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చితి మధ్య, దేశీయంగా బంగారం నిల్వలను రికార్డు స్థాయిలో పెంచుకుంటూ పోవడం ద్వారా భారత్ ఎంత శక్తివంతమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతోందో స్పష్టమవుతోంది. సామాన్యులకే కాదు, దేశాన్ని నడిపించే కేంద్ర బ్యాంకుకు కూడా బంగారంపై ఉన్న నమ్మకం ఎంతటిదో ఈ భారీ నిల్వలు నిరూపిస్తున్నాయి.

# పెట్రోల్, డీజిల్‌పై విండ్‌ఫాల్ ట్యాక్స్ తగ్గించిన కేంద్ర ప్రభుత్వం




న్యూఢిల్లీ: అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తగ్గడంతో ఇంధన ఎగుమతులపై విధించే 'విండ్‌ఫాల్ గెయిన్స్ టాక్స్'ను కేంద్ర ప్రభుత్వం భారీగా తగ్గించింది. జూన్ 1 నుంచి అమలులోకి వచ్చేలా పెట్రోల్ ఎగుమతిపై పన్నును సగానికి తగ్గిస్తూ లీటరుకు రూ.3 నుంచి రూ.1.5 కి, లీటర్ డీజిల్‌పై రూ.16.5 నుంచి రూ.13.5 కు, లీటర్ ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్)పై రూ.16 నుంచి రూ.9.5 కు తగ్గించింది.
అలాగే ఎగుమతి చేసే పెట్రోల్, డీజిల్‌లపై రోడ్డు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెస్ పూర్తిగా రద్దు కానుంది. దేశీయ వినియోగం కోసం సరఫరా చేసే ఇంధన ధరలలో ఎలాంటి మార్పూ లేదు. అమెరికా, ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల పైనే కొనసాగుతున్నాయి. ఈ సంక్షోభం దృష్ట్యా ఎగుమతిదారులు మితిమీరిన లాభాలు పొందకుండా అడ్డుకోవడానికి, దేశీయంగా సప్లయ్ పెంచడానికి ప్రభుత్వం గతంలో ఈ పన్నును విధించింది. కాగా, ప్రతి 15 రోజులకొకసారి ఈ సుంకాలపై రివ్యూ జరుగుతుంది.

# డిప్రెషన్ అంటే కేవలం మానసిక ఆరోగ్య సమస్యనే కాదు, మెదడు పనితీరుపైనా ప్రభావం చూపిస్తుంది..



డిప్రెషన్ అనేది కేవలం మానసిక ఆరోగ్య సమస్య మాత్రమే కాదు, అది మెదడు పనితీరుపై కూడా గణనీయమైన ప్రభావం చూపుతుందని తాజా అధ్యయనం వెల్లడించింది. ముఖ్యంగా డిప్రెషన్ ఎంతకాలం కొనసాగుతుందనే అంశం మెదడులో సంభవించే మార్పుల తీవ్రతను ప్రభావితం చేస్తుందని పరిశోధకులు గుర్తించారు. ఈ అధ్యయనం ఫలితాలు భవిష్యత్తులో వ్యక్తిగత అవసరాలకు అనుగుణమైన చికిత్సా విధానాల అభివృద్ధికి దోహదపడే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ పరిశోధనలో మేజర్ డిప్రెషన్‌తో బాధపడుతున్న 46 మంది రోగుల మెదడు స్కాన్‌లను విశ్లేషించారు. పరిశోధన ఫలితాలు డిప్రెషన్ ఎపిసోడ్‌ల వ్యవధి, మెదడులోని వివిధ నాడీ నెట్‌వర్క్‌ల మధ్య అనుసంధానంలో ఉన్న మార్పుల మధ్య సంబంధం ఉందని సూచించాయి. ముఖ్యంగా రెండేళ్లకు పైగా డిప్రెషన్‌తో బాధపడుతున్న వారిలో, ఇటీవల డిప్రెషన్ ప్రారంభమైన వారితో పోలిస్తే భిన్నమైన మెదడు కనెక్టివిటీ నమూనాలు కనిపించాయి.

**సమన్వయం దెబ్బ తినే అవకాశం..**

మెదడులోని సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ నెట్‌వర్క్ (జజుచీ) నిర్ణయాలు తీసుకోవడం, లక్ష్యాలపై దృష్టి కేంద్రీకరించడం వంటి పనులకు బాధ్యత వహిస్తుంది. మరోవైపు డిఫాల్ట్ మోడ్ నెట్‌వర్క్ (ణవీచీ) అనేది ఆత్మపరిశీలన, వ్యక్తిగత ఆలోచనలు, జ్ఞాపకాలతో సంబంధం కలిగి ఉంటుంది. సాధారణ పరిస్థితుల్లో ఈ రెండు నెట్‌వర్క్‌లు సమతుల్యంగా పనిచేస్తాయి. అయితే డిప్రెషన్ ఉన్నవారిలో ఈ సమన్వయం దెబ్బతినే అవకాశం ఉందని అధ్యయనం వెల్లడించింది. ఈ అసమతుల్యత కారణంగా వ్యక్తులు ప్రతికూల ఆలోచనల్లో చిక్కుకుపోవడం, పదేపదే అదే విషయాలను ఆలోచించడం, అవసరమైన సమయంలో పరిసరాలపై దృష్టి సారించడంలో ఇబ్బంది పడడం వంటి లక్షణాలు కనిపిస్తాయని పరిశోధకులు తెలిపారు. డిప్రెషన్ తీవ్రత పెరిగే కొద్దీ ఈ ప్రభావాలు మరింత స్పష్టంగా కనిపిస్తాయని పేర్కొన్నారు.

**డిప్రెషన్‌తో నెగెటివ్ ప్రభావం..**

అధ్యయనంలో మరో ఆసక్తికర అంశం వెలుగులోకి వచ్చింది. ఇటీవల డిప్రెషన్ ప్రారంభమైన రోగుల్లో లక్షణాలు తీవ్రమవుతున్న కొద్దీ జజుచీ, ణవీచీ మధ్య అనుసంధానం తగ్గుతున్నట్లు గుర్తించారు. అయితే చాలా కాలంగా డిప్రెషన్‌తో బాధపడుతున్న వారిలో పరిస్థితి భిన్నంగా కనిపించింది. వారిలో డిప్రెషన్ తీవ్రత పెరిగే కొద్దీ ఈ రెండు నెట్‌వర్క్‌ల మధ్య అనుసంధానం మరింత బలపడుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు. ఈ ఫలితాలు డిప్రెషన్ కారణంగా మెదడులో జరిగే మార్పులు కాలక్రమేణా అభివృద్ధి చెందుతాయని సూచిస్తున్నాయి. ప్రారంభ దశలో కొన్ని నెట్‌వర్క్‌ల మధ్య అనుసంధానం తగ్గిపోతుంది. అయితే వ్యాధి ఎక్కువకాలం కొనసాగినప్పుడు లేదా పదేపదే తిరిగి వచ్చినప్పుడు మెదడు పనితీరులో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని అధ్యయనం పేర్కొంది. డిప్రెషన్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించడం ఎంత ముఖ్యమో ఈ పరిశోధన మరోసారి స్పష్టం చేసింది. మెదడులోని మార్పులను అర్థం చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో ప్రతి వ్యక్తి పరిస్థితికి అనుగుణంగా మరింత సమర్థవంతమైన చికిత్సా విధానాలను అభివృద్ధి చేసే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# వేసవి కాలంలో రోజంతా బయట పనిచేసేవారు పాటించాల్సిన జాగ్రత్తలు ఇవే..

వేసవి కాలం బయట పని చేసే కార్మికులకు ఒక పెద్ద సవాల్ లాంటిదని చెప్పవచ్చు. నిర్మాణ కార్మికులు, రోడ్డు పని చేసేవారు, వ్యవసాయ కూలీలు, వీధి వ్యాపారులు, రోజువారీ కూలీలు వంటి వారు మండే ఎండలో గంటల తరబడి పనిచేయాల్సి వస్తుంది. అలాంటి పరిస్థితుల్లో ఆహారం కేవలం ఆకలి తీర్చడానికే కాదు, శరీరానికి శక్తిని అందించడానికి, నీటి లోపాన్ని తగ్గించడానికి, అలసటను ఎదుర్కోవడానికి కూడా కీలక పాత్ర పోషిస్తుంది. ఎండలో పని చేసే కార్మికులు వేసవికాలంలో ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల డీహైడ్రేషన్ బారిన పడకుండా కాపాడుకోవచ్చు. ఇవి తక్కువ ఖర్చుతో లభించడమే కాకుండా, శరీరానికి చల్లదనాన్ని అందించి తీవ్రమైన వేడిని తట్టుకునే శక్తిని ఇస్తాయి. వేసవిలో కార్మికులు భోజనంలో పెరుగు తప్పనిసరిగా తీసుకోవాలి. ఇది శరీరానికి చల్లదనాన్ని అందించడమే కాకుండా జీర్ణక్రియకు కూడా మేలు చేస్తుంది. అధిక ఉష్ణోగ్రతల వల్ల ఆకలి తగ్గినప్పుడు కూడా పెరుగును సులభంగా తినగలుగుతారు. చాలామంది పెరుగును అన్నంతో కలిపి లేదా రోటీతోపాటు తీసుకుంటారు. ఇది శరీరానికి ఉపశమనం కలిగించడంతోపాటు తేలికైన పోషణను అందిస్తుంది.

**పెరుగు, మజ్జిగ, కూరగాయలు..**

పెరుగుతోపాటు మజ్జిగను కూడా కార్మికులు వేసవి ఆహారంలో ముఖ్యమైన భాగంగా చేసుకోవాలి. రోజంతా చెమటలు పట్టే పనులు చేసే వారికి మజ్జిగ దాహాన్ని తగ్గించి శరీరాన్ని తాజాగా ఉంచుతుంది. జీలకర్ర పొడి, ఉప్పు లేదా పుదీనాతో తయారు చేసే మజ్జిగ మరింత రుచికరంగా ఉండటంతోపాటు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. తక్కువ సమయంలో తాగగలిగే ఈ పానీయం ఎండలో పనిచేసే వారికి తక్షణ ఉపశమనం కలిగిస్తుంది. అధిక మసాలాలు, నూనెతో చేసిన ఆహారం వేసవిలో భారంగా అనిపిస్తుంది. కనుక పెరుగన్నం, పప్పన్నం లేదా తేలికపాటి ఖిచిడీ వంటి ఆహారాలను ఎంచుకోవాలి. ఇవి కడుపుని నింపడంతోపాటు శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. ముఖ్యంగా అన్నం త్వరగా జీర్ణమై శరీరానికి తక్షణ శక్తిని అందించడంలో సహాయపడుతుంది. ఉల్లిపాయ, దోసకాయ, నిమ్మకాయ, టమాటా వంటి ముడి కూరగాయలు కూడా వేసవిలో కార్మికుల భోజనంలో తరచూ కనిపిస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల శరీరానికి చల్లదనం లభిస్తుంది. ముఖ్యంగా దోసకాయలో నీటి శాతం ఎక్కువగా ఉండటంతో దాహాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. ఉల్లిపాయ, పచ్చిమిర్చి, ఉప్పుతో కలిసి తింటే భోజనానికి రుచి పెరగడంతోపాటు వేడి ప్రభావాన్ని కూడా కొంత మేర తగ్గిస్తుంది.



**కొబ్బరినీళ్లు, పండ్లు..**

అవకాశం ఉన్నప్పుడు కొబ్బరి నీరు, సీజనల్ పండ్లు కూడా కార్మికులు ఆహారంలో భాగంగా తీసుకోవాలి. కొబ్బరి నీరు శరీరాన్ని త్వరగా హైడ్రేట్ చేయడంలో సహాయపడుతాయి. పుచ్చకాయ, తర్బూజా వంటి పండ్లు అధిక నీటి శాతంతో ఉండటంతో వేసవిలో శరీరానికి చల్లదనం అందిస్తాయి. మామిడి పండ్లు కూడా శక్తినిస్తాయి కానీ ఎక్కువగా తీసుకుంటే భారంగా అనిపించే అవకాశం ఉంటుంది కనుక మితంగా తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. చాలా మంది కార్మికులు ఉదయం ఇంటి నుంచి తీసుకెళ్లే రోటీలు, కూరలపై ఆధారపడతారు. కనుక సొరకాయ, బీరకాయ, గుమ్మడికాయ, ఆలుగడ్డ వంటి సీజనల్ కూరగాయలతో చేసిన సాధారణ కూరలను ఎక్కువగా తీసుకోవాలి. ఇవి ఎక్కువసేపు నిల్వ ఉండటమే కాకుండా జీర్ణక్రియకు కూడా అనుకూలంగా ఉంటాయి. తక్కువ నూనె, కొద్దిపాటి ఉప్పుతో తయారుచేసే ఈ భోజనం శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తుంది.

**సత్తు పానీయం..**

ఉత్తర భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో సత్తు వేసవిలో అత్యంత ప్రజాదరణ పొందిన ఆహారాల్లో ఒకటి. నీటిలో సత్తు, నిమ్మరసం, ఉప్పు కలిపి తాగడం వల్ల శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. ఇది ఒకేసారి దాహాన్ని తీర్చడమే కాకుండా పొట్టని కూడా నింపుతుంది. అలాగే అటుకులు వంటి తేలికపాటి ధాన్యాలతో తయారుచేసిన ఆహారాలు కూడా సులభంగా జీర్ణమై శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. వేసవిలో కార్మికులు ఈ సంప్రదాయ ఆహారాలు తీసుకోవడం ద్వారా కేవలం ఆకలి తీరడమే కాదు, మండే ఎండను ఎదుర్కొనే శక్తిని అందించే సహజ రక్షణ కవచాలుగా కూడా పనిచేస్తాయి. తక్కువ ఖర్చుతో, సులభంగా లభించే ఈ ఆహారాలు ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయని నిపుణులు చెబుతున్నారు

# రాత్రి భోజనం చేశాక కాసేపు నడిస్తే ఎన్నో లాభాలు.. రోజూ చేయాలంటున్న వైద్యులు..



భోజనం చేసిన వెంటనే కొద్దిసేపు నడవడం ఇప్పుడు సోషల్ మీడియాలో ఫార్ట్ వాక్స్ పేరుతో వైరల్ అవుతోంది. అయితే ఇది కొత్త అలవాటు కాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. భోజనం తర్వాత స్వల్పంగా నడవడం జీర్ణక్రియకు చాలా కాలంగా సూచిస్తున్న సరళమైన అలవాట్లలో ఒకటని వివరిస్తున్నారు. ఈ చిన్న నడక కేవలం ఆహారం జీర్ణం కావడానికే కాదు, కడుపులో గ్యాస్, ఉబ్బరం తగ్గించడంలో, మలబద్ధకం తగ్గించడంలో, అలాగే రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కూడా సహాయపడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. జీర్ణాశయ ఆరోగ్య నిపుణుల ప్రకారం భోజనం చేసిన తర్వాత 5 నుంచి 15 నిమిషాల పాటు నెమ్మదిగా నడవడం వల్ల జీర్ణవ్యవస్థ చురుకుగా పనిచేస్తుంది. ఇంటి చుట్టూ, ఆఫీస్‌లో, ట్రెడ్‌మిల్‌పై లేదా బయట వీధిలో నెమ్మదిగా నడిచినా సరిపోతుందని చెబుతున్నారు. ముఖ్యంగా ఈ సమయంలో కఠినమైన వ్యాయామం చేయకుండా సాదాసీదా నడక మాత్రమే చేయాలని సూచిస్తున్నారు.

**గ్యాస్ బయటకు వెళ్తుంది..**

భోజనం తర్వాత నడక వల్ల ఆహారం పేగుల్లో సులభంగా కదలడంలో సహాయం జరుగుతుంది. దీని వల్ల కడుపులో చిక్కుకుపోయిన గ్యాస్ బయటకు వెళ్లేందుకు అవకాశం ఉండి ఉబ్బరం తగ్గుతుంది. అలాగే పేగుల కదలికలు మెరుగుపడి మల విసర్జన సులభమవుతుంది. యాసిడ్ రిఫ్లక్స్ సమస్యతో బాధపడేవారికి కూడా ఈ అలవాటు కొంత ఉపశమనం ఇస్తుంది. భోజనం చేసిన వెంటనే పడుకోవడం లేదా కూర్చోవడం కంటే కొద్దిసేపు నడవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడి అసౌకర్యం తగ్గుతుంది. ఈ అలవాటులో ప్రత్యేకమైన పరికరాలు, ఖరీదైన ఫిట్‌నెస్ సామగ్రి అవసరం లేదు. ఎవరైనా సులభంగా రోజువారీ జీవితంలో భాగం చేసుకోవచ్చు. ముఖ్యంగా ఎక్కువసేపు కూర్చునే ఉద్యోగాలు చేసే వారికి భోజనం తర్వాత చిన్న నడక శరీరానికి చలనం కలిగించి ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

**ఎలా నడవాలి..**

ఫార్ట్ వాక్స్ చేయాలంటే ముందుగా భోజనం పూర్తి చేసిన తర్వాత కొద్దిసేపు ఆగాలి. ఆ తర్వాత నెమ్మదిగా, ఒత్తిడి లేకుండా నడవాలి. వేగంగా పరుగులు తీయడం లేదా గట్టిగా వ్యాయామం చేయడం మంచిది కాదు. రోజూ రాత్రి భోజనం తర్వాత ఇలా కొద్దిసేపు నడిస్తే జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. సాధారణంగా కనిపించే ఈ అలవాటు దీర్ఘకాలంలో మంచి ఆరోగ్యానికి దోహదపడుతుంది. ముఖ్యంగా జీర్ణక్రియ సమస్యలు, గ్యాస్, మలబద్ధకం వంటి ఇబ్బందులు తరచూ ఎదురయ్యే వారు ఈ అలవాటును ప్రయత్నించవచ్చు.

# ఆర్సీబీ వరుస టైటిళ్ల రహస్యం ఇదే!: కోచ్ ఆండీ ఫ్లవర్



**హైదరాబాద్ పెన్ పవర్:** రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) వరుసగా రెండోసారి ఐపీఎల్ టైటిల్ గెలవడం వెనుక ఉన్న రహస్యాన్ని హెడ్ కోచ్ యాండీ ఫ్లవర్ వివరించాడు. 2025లో తొలి టైటిల్ గెలిచినప్పటి ఉద్విగ్నభరిత వాతావరణానికి, 2026లో టైటిల్‌ను నిలబెట్టుకున్నప్పటి నిలకడైన ప్రదర్శనకు మధ్య ఉన్న తేడాను ఫ్లవర్ విశ్లేషించాడు. ఈసారి జట్టులో ప్రగాఢ ఆత్మవిశ్వాసం ఉండటమే తమ విజయానికి ప్రధాన కారణమని స్పష్టం చేశాడు. సోమవారం జరిగిన వర్చువల్ మీడియా సమావేశంలో ఫ్లవర్ మాట్లాడుతూ, 2024 సీజన్‌లో ఎదురైన కఠిన సవాళ్లే తమను బలోపేతం చేశాయని అన్నాడు.

“2025, 2026 టైటిల్ విజయాల మధ్య కచ్చితంగా తేడాలు ఉన్నాయి. అయితే నేను 2024 సీజన్‌ను కూడా గుర్తుచేసుకోవాలి. ఆ ఏడాది తొలి అర్ధభాగంలో ఎదురైన పరాజయాలు మాలో పట్టుదలను పెంచాయి. వ్యూహాత్మకంగా కొన్ని మార్పులు చేసుకోవడానికి, ధైర్యంగా నిర్ణయాలు తీసుకోవడానికి ఆ పరిస్థితులే కారణం” అని ఫ్లవర్ తెలిపాడు.ఫ్లవర్ ఇంకా వివరిస్తూ, “2025లో తొలిసారి టైటిల్ గెలిచాం. అయితే, ఆర్సీబీకి గతంలో టైటిల్ గెలిచిన అనుభవం లేకపోవడంతో ఆ సీజన్ లో చాలా ఒత్తిడి, అనిశ్చితి ఉండేవి. కానీ ఈ ఏడాది పరిస్థితి భిన్నంగా ఉంది. గత ఏడాది టైటిల్ గెలిచిన తర్వాత జట్టులో ఆత్మవిశ్వాసం రెట్టింపు అయింది. విరాట్ కోహ్లీ, భువనేశ్వర్ కుమార్, హేజిల్‌వుడ్, కృనాల్ పాండ్యా వంటి అనుభవజ్ఞులైన ఆటగాళ్లు జట్టులో ఉండటం కోచింగ్ సిబ్బందిగా మా పనిని సులభతరం చేసింది. ప్లేఆఫ్స్‌కు వెళ్లేటప్పుడు వారిలో కనిపించిన ఆ నమ్మకమే మమ్మల్ని గెలిపించింది” అని అన్నాడు.

**జట్టు సంస్కృతే విజయానికి పునాది**

జట్టులో ఆడే అవకాశం రాని ఆటగాళ్లను కూడా ప్రోత్సహించడం, వారిలో స్ఫూర్తి నింపడం తమ విజయానికి కీలకమని ఫ్లవర్ అభిప్రాయపడ్డాడు. “ఒక జట్టులో యువకులు, అనుభవజ్ఞులు, వివిధ దేశాల ఆటగాళ్లు ఉంటారు. అందరినీ ఒకేతాటిపైకి తీసుకురావడం పెద్ద సవాల్. ఆడని ఆటగాళ్లకు కూడా తాము ఎదుగుతున్నామనే భావన కలిగించాలి. వారికి విలువ ఇవ్వడం చాలా ముఖ్యం. అండర్-19 ప్రపంచకప్ నుంచి వచ్చిన విహాన్ మల్హోత్రా, కనిష్క్ చౌహాన్ వంటి యువ ఆటగాళ్లు విరాట్ వంటి సీనియర్లను చూసి ఎంతో నేర్చుకున్నారు” అని వివరించాడు.

ఈ విషయంలో వెంకటేశ్ అయ్యర్ అత్యుత్తమ ఉదాహరణ అని ఫ్లవర్ ప్రశంసించారు. “వెంకటేశ్ అయ్యర్ భారత్ తరఫున ఆడి, ఐపీఎల్ టైటిళ్లు గెలిచిన అనుభవం ఉన్నా, జట్టు కూర్పు ప్రకారం కొన్ని మ్యాచ్‌లకు దూరంగా ఉండాల్సి వచ్చింది. అయినా అతను ఓపికతో ఉన్నాడు. ఫిల్ సాల్ట్ గాయంతో దూరమైనప్పుడు వచ్చిన అవకాశాన్ని అద్భుతంగా సద్వినియోగం చేసుకున్నాడు. ప్రతి మ్యాచ్‌లో కీలక పరుగులు చేసి జట్టు విజయంలో భాగమయ్యాడు. సిద్ధంగా ఉండటం అంటే ఏమిటో అతను నిరూపించాడు” అని కొనియాడాడు.సీనియర్ల పాత్రపై మాట్లాడుతూ, “విరాట్, భువీ, హేజిల్‌వుడ్ వంటి ఆటగాళ్లు ఒత్తిడిలో ప్రశాంతంగా ఉంటారు. ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌లు లేదా యాషెస్ వంటి పెద్ద టోర్నీలలో ఆడిన అనుభవం వారికి ఉంది. వారి ప్రశాంతత జట్టు మొత్తానికి పాజిటివ్ ఎనర్జీ ఇస్తుంది. ముఖ్యంగా గత రెండు సీజన్లలో భువనేశ్వర్ ఒత్తిడిలో అద్భుత ప్రదర్శనలు చేయకపోయి ఉంటే, మాకు ఈ విజయాలు దక్కేవి కావు. ఈ ఆత్మవిశ్వాసాన్ని వచ్చే సీజన్‌లో కూడా కొనసాగించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం” అని ఫ్లవర్ ముగించాడు.

# క్రికెట్‌లో ఐసీసీ కీలక నిర్ణయాలు.. వెలుతురు తగ్గితే పింక్ బాల్!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఖఅంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టెస్ట్ క్రికెట్‌లో పలు కీలక మార్పులకు ఆమోదముద్ర వేసింది. అహ్మదాబాద్‌లో జరిగిన వార్షిక బోర్డు సమావేశంలో తీసుకున్న ఈ నిర్ణయాలలో ముఖ్యమైనది, వెలుతురు మందగించినప్పుడు పింక్ బాల్ వాడకం. టెస్ట్ మ్యాచ్‌లలో వెలుతురులేమి కారణంగా ఆట నిలిచిపోకుండా, పూర్తి ఓవర్లు జరిగేలా చూడటమే ఈ ప్రయోగం ముఖ్య ఉద్దేశం.ఈ కొత్త నిబంధన ప్రకారం, టెస్ట్ మ్యాచ్ ఎప్పటిలాగే రెడ్ బాల్‌తో ప్రారంభమవుతుంది. ఒకవేళ ఆట మధ్యలో వెలుతురు తగ్గితే, ఫ్లడ్‌లైట్ల వెలుగులో పింక్ బాల్‌తో ఆటను కొనసాగించవచ్చు. అయితే, సిరీస్ ప్రారంభానికి ముందే ఇరు జట్లు దీనికి అంగీకరించాల్సి ఉంటుంది. ఉదాహరణకు, 90 ఓవర్ల ఆటలో 75 ఓవర్లు ముగిశాక వెలుతురు తగ్గితే, మిగిలిన ఓవర్లను పింక్ బాల్‌తో పూర్తి చేస్తారు.దీంతో పాటు మరికొన్ని ముఖ్యమైన నిబంధనలను కూడా ఐసీసీ ఆమోదించింది. ఇకపై డ్రింక్స్ విరామ సమయంలో హెడ్ కోచ్‌లు మైదానంలోకి వచ్చి ఆటగాళ్లతో మాట్లాడేందుకు అనుమతి ఇచ్చారు. అలాగే, బౌలర్ల సందేహాస్పద యాక్షన్‌ను పర్యవేక్షించేందుకు మ్యాచ్ అధికారులు హాక్-ఐ డేటాను ఉపయోగించుకోవచ్చు. ఇప్పటివరకు ప్రయోగాత్మకంగా ఉన్న లెగ్-సైడ్ వైడ్ల నిబంధనను శాశ్వతం చేశారు.టీ20 మ్యాచ్‌లలో 15 నిమిషాల విరామాన్ని తప్పనిసరి చేసింది. ఆట తిరిగి ప్రారంభమైనప్పుడు బ్యాట్స్‌మెన్ సిద్ధంగా ఉండాలని పేర్కొంది. మరోవైపు, నిబంధనల ఉల్లంఘన కారణంగా క్రికెట్ కెనడా సభ్యత్వంపై ఐసీసీ తక్షణమే సస్పెన్షన్ వేటు వేసింది. అయితే, సస్పెన్షన్ కాలంలోనూ కెనడా జాతీయ జట్లు ఐసీసీ ఈవెంట్లలో పాల్గొనవచ్చని స్పష్టం చేసింది. ఈ కొత్త నిబంధనలన్నీ 2026 అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

క్రికెట్ కెనడాకు సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవడానికి కొన్ని కఠినమైన షరతులు విధించింది. ఈ ప్రక్రియను ఐసీసీ నార్మలైజేషన్ కమిటీ పర్యవేక్షిస్తుంది. వారు నిర్దేశించిన మార్పులను,

నిబంధనలను విజయవంతంగా అమలు చేస్తేనే క్రికెట్ కెనడా సభ్యత్వాన్ని తిరిగి పునరుద్ధరిస్తారు. అప్పటివరకు వారి సభ్యత్వం ప్రమాదంలో ఉన్నట్లేనని ఐసీసీ పరోక్షంగా సూచించింది.ఐసీసీ బోర్డు మహిళల క్రికెట్‌కు సంబంధించి కూడా కీలక నిర్ణయాలు ఆమోదించింది. ఐసీసీ మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ 2027 టోర్నమెంట్ తేదీలను మార్చింది. ఈ టోర్నీని 2027 ఫిబ్రవరి 14 నుంచి 28 వరకు నిర్వహించనున్నారు.

దీంతో పాటు, 2026లో ‘ఐసీసీ మహిళల ఎమర్జింగ్ నేషన్స్ ట్రోఫీ’ని ప్రారంభించనున్నట్లు బోర్డు ధృవీకరించింది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 10 జట్లు పాల్గొంటాయి. వీటిలో ఐదు పూర్తిస్థాయి సభ్య దేశాలు, ఐదు అసోసియేట్ సభ్య దేశాలు ఉంటాయి. ర్యాంకింగ్‌లు, గత టీ20 ప్రపంచకప్ క్వాలిఫికేషన్ ప్రదర్శనల ఆధారంగా జట్లను ఎంపిక చేయనున్నారు.



రాషా థడాని యొక్క మంత్రముగ్ధ లను చేసే రెడ్ లెహంగా గ్లో స్పాట్‌లైట్‌ను దొంగిలించింది

# రూ.1000 కోట్ల మూవీ.. ఓటీటీ రిలీజ్ పై చర్చేంటి?



ఓటీటీల్లోకి కొత్త సినిమాలు వస్తున్నాయంటే ప్రేక్షకుల్లో ఆసక్తి ఉండటం కామన్. ముఖ్యంగా థియేటర్లలో సంచలనం సృష్టించిన చిత్రాల విషయంలో అది మరింత ఎక్కువగా ఉంటుంది. ఇప్పుడు అలాంటి చర్చే బ్లాక్ బస్టర్ హిట్ సైకాలజికల్ హారర్ థ్రిల్లర్ అబ్సెషన్ చుట్టూ జరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా భారీ విజయాన్ని అందుకున్న ఆ హాలీవుడ్ సినిమా ఎప్పుడు ఓటీటీలోకి వస్తుంది? థియేటర్లలో చూసిన వెర్షన్ నే విడుదల చేస్తారా? లేక ఎలాంటి కట్స్ లేకుండా వెర్షన్ తీసుకొస్తారా? అనే ప్రశ్నలు సోషల్ మీడియాలో ఇప్పుడు వినిపిస్తున్నాయి.ఇటీవల వరల్డ్ బాక్సాఫీస్ వద్ద అత్యంత పెద్ద సర్ప్రైజ్ గా నిలిచిన చిత్రాల్లో అబ్సెషన్ ఒకటి. చాలా తక్కువ బడ్జెట్ తో తెరకెక్కిన ఆ సినిమా ఓ రేంజ్ లో ప్రేక్షకులను ఆకట్టుకుంది. సైకాలజికల్ హారర్, సూపర్ నేచురల్ ఎలిమెంట్స్ తో రూపొందిన ఆ చిత్రం విడుదలైన తర్వాత మంచి మౌత్ టాక్ ను సొంతం చేసుకుంది. అదే సినిమా విజయానికి మెయిన్ రీజన్ గా మారింది.ఒక చిన్ననాటి బొమ్మ చుట్టూ తిరిగే కథను దర్శకుడు ఇంట్రెస్టింగ్ గా తెరకెక్కించారు. కోరిక నెరవేరిన తర్వాత వాటి ఎఫెక్ట్ ఎలా భయానకంగా మారుతుందనే అంశాన్ని చూపించారు. కథలోని సస్పెన్స్, భయపెట్టే సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో సినిమా వసూళ్లు రోజురోజుకూ పెరుగుతున్నాయి. బాక్సాఫీస్ వద్ద ఆ సినిమా సాధిస్తున్న వసూళ్లు కూడా అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి.భారీ బడ్జెట్ సినిమాలు పోటీలో ఉన్నప్పటికీ అబ్సెషన్ దూసుకుపోతోంది. ప్రపంచవ్యాప్తంగా వంద మిలియన్ డాలర్లకు పైగా వసూళ్లు సాధించి దాదాపు రూ.1000 కోట్ల మార్క్ కు చేరువైంది. చిన్న సినిమాగా ప్రారంభమైన ఆ చిత్రం ఇప్పుడు పెద్ద చర్చకు కారణమైంది. అయితే ప్రస్తుతం ప్రేక్షకుల దృష్టి ఓటీటీ విడుదలపైనే ఉంది. థియేటర్లలో విడుదలైన వెర్షన్ కే మంచి రెస్పాన్స్ రావడంతో అదే వెర్షన్ ను ఓటీటీలో అందుబాటులోకి తీసుకురావచ్చని ప్రచారం జరుగుతోంది.

మరోవైపు కొంతమంది అభిమానులు మాత్రం ఎలాంటి కట్స్ లేకుండా పూర్తి వెర్షన్ ను విడుదల చేయాలని కోరుతున్నారు. గతంలో కొన్ని హాలీవుడ్ చిత్రాలు థియేటర్ల వెర్షన్స్ కాకుండా సెపరేట్ వెర్షన్లతో ఓటీటీల్లో విడుదలైన సందర్భాలు ఉన్నాయి. అందుకే అబ్సెషన్ విషయంలో కూడా అలాంటి అవకాశం ఉందా అనే చర్చ సాగుతోంది. కానీ సెన్సార్ ఆర్డర్ ప్రకారం, ఇండియాలో థియేటర్లలో ప్రదర్శించిన వెర్షన్ నే ఓటీటీలో విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని టాక్ వినిపిస్తోంది. దీంతో ఒక్కొక్కరు ఒక్కోలా రెస్పాండ్ అవుతున్నారు.అయితే ఇప్పటివరకు మూవీ టీమ్ నుంచి స్ట్రీమింగ్ డేట్ పై గానీ, ఓటీటీ ప్లాట్ ఫామ్ పై గానీ ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. అనౌన్స్మెంట్ వచ్చిన తర్వాత క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. ఏదేమైనా బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేసిన అబ్సెషన్ ఇప్పుడు ఓటీటీ రిలీజ్ చర్చలతో మరోసారి వార్తల్లో నిలిచింది. మరి స్ట్రీమింగ్ తేదీ ఎప్పుడు ప్రకటిస్తారో, ఇండియాలో ఏ వెర్షన్ ప్రేక్షకుల ముందుకు వస్తుందో చూడాలి.



పెర్ల్ పర్ఫెక్షన్: సోనాల్ చౌహాన్ కలలు కనే వెల్వెట్ సొగసు

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965